

రాజధాని అంశంలో వైసీపీ ప్రవర్తన పరాకాష్టకు చేరింది. పార్టీగా కాకుండా నాటక సంస్థలా వ్యవహరిస్తోంది. అమరావతిని విమర్శించే ముందు తమ గత నిర్ణయాలు, విధానాలు గుర్తు చేసుకోవాలి. ప్రజలను గందరగోళానికి గురిచేసే రాజకీయాల కంటే స్పష్టమైన దృక్పథంతో ముందుకు రావడం అవసరం.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**

శనివారం 11.04.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 | సంచిక - 354 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00


## దీపం లబ్ధిదారులకు పీఎన్‌జీ వరం




- దీపం లబ్దిదారులకు పీఎన్జీ వినియోగంపై అవగాహన కల్పించండి
- పీఎన్జీ కనెక్షన్లు పెరగాలి... ఆయిల్ కంపెనీలు లక్ష్యం చేరుకోవాలి
- సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశం
- శ్రీకాకుళం-కాకినాడ నేచురల్ గ్యాస్ పైపు లైన్ పనుల పూర్తికి కేంద్రం మంత్రికి సీఎం ఫోన్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** యుద్ధాల కారణంగా తలత్తిన ఎల్పీజీ గ్యాస్ సరఫరా సమస్యను ఎదుర్కొనేందుకు మరింత సన్నద్ధతతో పనిచేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు, ఆయిల్ కంపెనీలకు సూచించారు. పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) వినియోగం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. దీపం పథకం లబ్దిదారులకు పీఎన్జీ వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. దీపం పథకం లబ్దిదారులు పీఎన్జీకి మారితే... వారికి దీపం పథకం కింద ఇచ్చే రాయితీ సొమ్మును జమ చేసేందుకు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామని... దీనిపై వెంటనే ఉత్తర్వులు విడుదల చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. పీఎన్జీ కనెక్షన్ తీసుకున్నా దీపం పథకం ద్వారా కలిగే లబ్ది పొందవచ్చన్న విషయంపై లబ్దిదారులకు అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. గ్యాస్ సరఫరా ఇబ్బందులను అధిగమించడానికి ఆయిల్ కంపెనీలు పీఎన్జీ కనెక్షన్లను పెంచేందుకు మిగతా 2లో...

## ప్రపంచ సాంకేతిక పటంలో

# ఏపీకి నవశకం



- క్వాంటం డీప్ టెక్‌లో అజేయ శక్తిగా అమరావతి
- ఏప్రిల్ 14 తేదీన ప్రారంభం క్వాంటం టెస్టింగ్ రిఫరెన్స్ ఫెసిలిటీ
- మేధాటవర్స్, ఎస్ఆర్ఎం నుంచి పనిచేయనున్న 1ఎస్, 1క్యూ క్వాంటం టెస్ట్ బెడ్స్
- డ్రగ్ డిస్కవరీ, వెదర్ మోడలింగ్ సహా వివిధ పరిశోధనలు, ఆవిష్కరణల కేంద్రంగా అమరావతి క్వాంటం వ్యాలీ
- దేశంలోనే తొలిసారి స్వదేశీ తయారీ క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** నవశకం సాంకేతికత క్వాంటం టెక్నాలజీలో గ్లోబల్ లీడర్‌గా అమరావతి ఎదుగుతోంది. నేషనల్ క్వాంటం మిషన్ లక్ష్యాలను అందిపుచ్చుకుని దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రంగా రూపు దిద్దుకుంటోంది. క్వాంటం టెక్నాలజీలో పరిశోధనలు, ఆవిష్కరణల దిశగా అవసరమైన ఎకోసిస్టం సిద్ధమవుతోంది. మూడు దశాబ్దాల క్రితం ఐటీ విప్లవానికి నాంది పలికిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇప్పుడు క్వాంటం టెక్నాలజీ తో ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ ప్రపంచానికి చిరునామాగా మారుస్తున్నారు. ఏప్రిల్ 14, ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి అమరావతిలో దేశంలోనే మొట్టమొదటి స్వదేశీ క్వాంటం కంప్యూటర్ల టెస్టింగ్ రిఫరెన్సు ఫెసిలిటీని సీఎం ప్రారంభించనున్నారు. గన్నవరంలోని మేధాటవర్స్ తో పాటు రాజధానిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ లో 1ఎస్, 1 క్యూ పేరిట రెండు వేర్వేరు క్వాంటం టెస్టింగ్ రిఫరెన్సు ఫెసిలిటీలు ప్రారంభం కానున్నాయి. దీంతో దేశంలోనే క్వాంటం టెస్ట్ రిఫరెన్సు ఫెసిలిటీ కలిగిన తొలి రాష్ట్రంగా ఏపీ అవతరించనుంది. ఈ స్వదేశీ నిర్మిత క్వాంటం రిఫరెన్స్ టెస్ట్ ఫెసిలిటీలు అమరావతిని ఓ అత్యాధునిక క్వాంటం ఎకోసిస్టమ్ గా తీర్చిదిద్దనున్నాయి. పూర్తి స్వదేశీ టెక్నాలజీతో భారత్ లోనే తొలిసారి క్వాంటం కంప్యూటర్ హార్డ్ వేర్ ను పరీక్షించే సౌకర్యాన్ని అమరావతిలో ఏర్పాటు చేశారు. అమరావతి 1Q పేరిట మినీ క్వాంటం కంప్యూటింగ్ టెస్టింగ్ ఫెసిలిటీని గన్నవరంలోని మేధా టవర్స్‌లో ఏర్పాటు చేశారు. అమరావతి 1S పేరిట రాజధాని లోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో విద్యార్థులు, పరిశోధకుల కోసం ఇది 'ఓపెన్ యాక్సెస్' ప్రాతిపదికన మరో క్వాంటం రిఫరెన్సు టెస్ట్ ఫెసిలిటీని తీర్చిదిద్దారు. క్వాంటం కంప్యూటింగ్ ప్రక్రియను ప్రత్యక్షంగా వీక్షించేలా 2 లో..▶

## యువత సవాళ్లను స్వీకరిద్దాం



- ట్రెండ్ ను అనుసరించకుండా లక్ష్యంపై దృష్టిపెట్టాలి
- ఏం నేర్చుకున్నారన్నది కాదు.. ఎలా ఆలోచిస్తున్నారనేది ముఖ్యం
- షార్ట్‌కట్‌ల ప్రపంచంలో నైతికతే గొప్ప బలం
- ఎవరూ చూడనప్పుడు మీరేం చేస్తారో అదే మీ వ్యక్తిత్వం
- ఏపీ, విశాఖ అభివృద్ధిలో సత్వా గ్రూప్ భాగస్వామ్యం కాబోతోంది
- గ్రీన్ ఉడ్ హై సంస్థ గ్లోబల్ సిటిజన్స్ ను తయారుచేస్తుండటం గర్వకారణం
- బెంగళూరు గ్రీన్‌ఉడ్ హై ఇంటర్నేషనల్ స్కూల్ ఐబీడీపీ గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో మంత్రి నారా లోకేష్

**బెంగళూరు (జర్నలిస్ట్ ఫైల్) :** యువత సవాళ్లను స్వీకరించి ముందుకు సాగాలని, ట్రెండ్ ను అనుసరించకుండా లక్ష్యంపై దృష్టిపెట్టాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. బెంగళూరు సర్జాపూర్ లో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సత్వా గ్రూప్ ఆధ్వర్యంలోని గ్రీన్‌ఉడ్ హై ఇంటర్నేషనల్ స్కూల్ ఐబీడీపీ(ఐబీ డిప్లమా ప్రోగ్రామ్) గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో(2026) మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఈ రోజు కేవలం గ్రాడ్యుయేషన్ డే వేడుక మాత్రమే కాదు. జ్ఞాపకాలు కలలను కలిసే చోటు, విద్యార్థులు భవిష్యత్ నాయకులుగా మరే ప్రత్యేకమైన క్షణం. ఈ కార్యక్రమానికి నన్ను ఆహ్వానించడానికి పాఠశాల బృందం వచ్చినప్పుడు.. ఈ ఏడాది గ్రాడ్యుయేషన్ థీమ్ 'కొత్త అవకాశాలకు నాంది పలకడం'(గాఅశీఅవవతీఅఅస్త్రాశీంంఅఎఅశ్రీఙఅవం) అనే థీమ్ ను విద్యార్థులే ఎంచుకున్నారని చెప్పడం నాకు ఆశ్చర్యంతో పాటు ఆనందాన్ని కలిగించింది. ఇది చాలు మీరేంటో చెప్పడానికి. ఎందుకంటే ఇది కేవలం థీమ్ మాత్రమే కాదు.. ఒక ఆలోచనా విధానం. మీలో ఉన్న ధైర్యాన్ని, జిజ్ఞాసను ప్రతిబింబిస్తోంది. 'తర్వాత ఏమిటి' అని అడగడానికి భయపడని తరం, మరీ ముఖ్యంగా 'ఎందుకు కాదు?' అని ప్రశ్నించే తరం. నేటి ప్రపంచానికి అవసరమైనది కూడా అదే.

**గ్రీన్ ఉడ్ హై సంస్థ గ్లోబల్ సిటిజన్స్ ను తయారుచేస్తుండటం గర్వకారణం :** గ్రీన్‌వుడ్ హై ఇంటర్నేషనల్ స్కూల్ వంటి సంస్థలను నిర్మించడంలో సత్వా గ్రూప్ పాత్ర అభినందనీయం. మిగతా 2లో...



## బీజేపీ బలోపేతానికి ప్రణాళిక

- బీజేపీ జాతీయ అధ్యక్షుడితో పీవీయన్ మాధవ్ భేటీ
- గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు కార్యకలాపాల విస్తరణపై విస్తృత చర్చలు
- ఏపీ బీజేపీ కార్యక్రమాలపై నితిన్ నబిన్ అభినందనలు

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీయన్ మాధవ్, పార్టీ జాతీయ అధ్యక్షులుడు నితిన్ నబిన్‌ను కలుసుకుని కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. హస్తినాపురంలో శుక్రవారం జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, రాబోయే కార్యక్రమాలపై సమగ్ర చర్చ జరిగినట్లు వెల్లడించారు.

అటల్ బిహారి వాజ్‌పేయి శతజయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన బస్సు యాత్రకు సంబంధించిన చిత్రమాలిక పుస్తకాన్ని ఈ సందర్భంగా నితిన్ నబిన్ ఆవిష్కరించారు. రాష్ట్రంలో నిర్వహించిన కార్యక్రమాలను ప్రశంసించగా, ఇందుకు మాధవ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఈ భేటీలో పార్టీ సంస్థాగత బలోపేతం, కార్యకర్తలతో సమన్వయం, గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు కార్యకలాపాల విస్తరణపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేయడానికి 15 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు మాధవ్ వెల్లడించారు. మిగతా 2లో...

## రెవెన్యూకు 'జవసత్వాలు'!



- 22 నెలల్లో రెవెన్యూ శాఖకు కొత్త జవసత్వాలు...సంస్కరణలతో సమూల మార్పులు
- భూవివాదాలతో ప్రజలకు మానసిక క్షోభ మిగిల్చిన గత పాలకులు
- వ్యవస్థలను విధ్వంసం చేసి...ప్రజల ఆస్తులకు భద్రత లేకుండా చేసిన గత ప్రభుత్వం
- నాటి రీసర్వే తప్పులను సరిదిద్దుతూ రీ సర్వే 2.0 కార్యక్రమం
- రాజముద్రతో, సెక్యూరిటీ ఫీచర్స్‌తో కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు
- 2027 మార్చి నాటికి రీసర్వే 2.0 ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టాక ఈ 22 నెలల్లో సమూల మార్పులు, సంస్కరణలతో రాష్ట్ర రెవెన్యూ శాఖకు కొత్త జవసత్వాలు వచ్చాయి. ఆ శాఖపై నాడు ఉన్న ప్రజా వ్యతిరేకత, అవినీతి ముద్ర నేడు చెరిగిపోతోంది. అప్పుడు అత్యధిక అర్జీలు, సమస్యలతో మిగిలిన శాఖల కన్నా ముందున్న రెవెన్యూ శాఖలో ఇప్పుడు పనితీరు ఎంతో మెరుగయ్యింది. రెవెన్యూ వ్యవస్థ రోజురోజుకూ బలపడుతోంది. సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ చూపడంతో రెవెన్యూ సమస్యలు చాలా వం-కు పరిష్కారం అవుతూ వచ్చాయి. అర్జీల సంఖ్య తగ్గుతోంది. గతంతో పోల్చుకుంటే రెవెన్యూ సేవలపై ప్రజల్లో ప్రస్తుతం సంతృప్తి వ్యక్తమవుతోంది. దీన్ని మరింత పెంచాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి ఉన్నారు. భూ వివాదాలతో ఎవరూ రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఎన్నో చర్యలు తీసుకున్నారు. మిగతా 2లో...

## న్యాయ శాఖ పటిష్టతకు చర్యలు



### పబ్లిక్ లిటిగేషన్ పాలసీపై మంత్రివర్గ ఉపసంఘం భేటి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో న్యాయ శాఖ పటిష్టత కోసం ప్రణాళికబద్ధ చర్యలు తీసుకునేందుకు కార్యాచరణ చేపట్టినట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా వ్యాజ్య విధానం (ఏపీ స్టేట్ పబ్లిక్ లిటిగేషన్ పాలసీ ) ను పరిశీలించడానికి ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం శుక్రవారం భేటీ అయింది. వెలగపూడి సచివాలయం లో రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత,వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ లు న్యాయశాఖ ఉన్నతాధికారులతో విస్తృతంగా చర్చించారు. న్యాయ శాఖ లోతప్పనిసరి వ్యాజ్యాలను తగ్గించడం, సకాలంలో ప్రభావవంతమైన వివాద పరిష్కారాన్ని నిర్ధారించడం,పారదర్శకత, జవాబుదారీతనం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో మంత్రివర్గ ఉప సంఘం ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా “ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా వ్యాజ్య విధానంపై పలు నిర్ణయాలను రూపొందించడంలో 2లో...

## రాయలసీమకు దగా చేసింది జగనే

- రాయలసీమ ప్రాజెక్ట్‌ను వైసిపి రాజకీయంగా వాడుకోవాలని చూడటం హేయం
- రాయలసీమపై ప్రేమ ఉన్నట్టు మరోసారి రాజకీయం చేయాలని చూస్తుంది
- మీ హాయాంలోనే ఎన్జీటీ ఆదేశాలతో రాయలసీమ ప్రాజెక్ట్ ఆగిపోయింది కాదా..
- రాయలసీమకు రూ.40 వేల కోట్లతో హార్టీకల్చర్ హబ్ తీసుకువస్తున్నాము
- ఒకే ఏడాదిలోనే హంద్రీనీవా ప్రాజెక్ట్ కు నిధులు కేటాయించి పనులు కూడా పూర్తి చేసిన ఘనత మాది
- రాయలసీమ అభివృద్ధికి మీ హాయాంలో ఎంత ఖర్చు పెట్టారో చర్చకు సిద్ధం
- తుంగభద్ర డ్యాం గేట్లు వర్షాలు వచ్చే లోపు పూర్తిగా బిగిస్తాము.




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాయలసీమ మీద ఇప్పుడు ప్రేమ ఉన్నట్టు వైసీపీ నాయకులు మొసలి కన్నీరు కార్చుతూ మీటింగ్‌లు పెడుతున్నారు. ఆర్థిక,ప్రణాళిక, వాణిజ్య పన్నుల శాఖామాత్యులు పయ్యావుల కేశవ్ ఎద్దేవ చేశారు. ఏపీ సచివాలయంలోని ప్రచార విభాగంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల మాట్లాడుతూ నేడు రాయలసీమ మీద అవ్యాజ్యప్రేమ చూపుతున్న వైసిపి నాయకులు అధికారంలో ఉన్న 5 ఏళ్లలో రాయలసీమకు ఏం చేశారని ప్రశ్నించారు. కనీసం కాల్వల్లో తట్ట మట్టి తీశారా. కనీసం కొట్టుకుపోయిన అన్నమయ్య డ్యాం వైపు తిరిగి చూశారా.. రాయలసీమ ప్రాజెక్ట్ ను చంపింది మీరు కాదా అని నిలదీశారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఎన్జీటీ ఆదేశాలతో మీ హాయాంలోనే ఆగిపోయిందని, మరి అలాంటప్పుడు ఆగిపోయిన ప్రాజెక్ట్ ను మళ్లీ మేము ఏలా ఆపగలమని ప్రశ్నించారు. మిగతా 3లో...

## అమరావతిలో విద్యుత్ పనులు వేగవంతం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అమరావతి రాజధాని ప్రాంతంలో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారులకు ఆదేశించారు. సచివాలయంలో సీఆర్డీఏ, విద్యుత్ శాఖ అధికారులతో మంత్రులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీఆర్డీఏ కమిషనర్ విజయరామరాజు, సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డిలతో పాటు ఇరు శాఖలకు సంబంధించిన ఇతర అధికారులు హాజరయ్యారు. రాజధాని పరిధిలో చేపట్టిన విద్యుత్ శాఖ పనుల పురోగతిపై ఇరువురు మంత్రులు సమగ్రంగా చర్చించారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని మంత్రులు గొట్టిపాటి, నారాయణ అధికారులను ఆదేశించారు. మాస్టర్ ప్లాన్‌లో ఎలాంటి మార్పులు చేయకుండా విద్యుత్ నిర్మాణ పనులు కొనసాగించాలని సూచించారు. ముఖ్యంగా హైటెన్షన్ లైన్ల మార్పిడి పై ఇరు శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి పనులను సమయానికి పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. అలాగే, న్యాయమూర్తులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు, అఖిల భారత సర్వీసు అధికారుల నివాసాలకు నిరంతర విద్యుత్ సరఫరా అందేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా సమావేశంలో చర్చించారు. రాజధాని అభివృద్ధిలో విద్యుత్ మౌలిక వసతులు కీలకమని, వాటి నిర్మాణం నాణ్యతతో పాటు సమయపాలనతో పూర్తి కావాలని మంత్రులు తెలిపారు.

# ప్రపంచ సాంకేతిక పటంలో ఏపీకి నవశకం



(మొదటి పేజీ తరువాయి)

ఓపెన్ యాక్సెస్ రిఫరెన్సు ఫెసిలిటీగా దీనిని ఏర్పాటు చేశారు.

**క్వాంటం హార్డ్‌వేర్ తయారీలో కీలకం :** మేధాటవర్స్ సహా ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఏర్పాటు చేస్తున్న ఈ క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీ టెస్ట్ బెడ్ లు క్వాంటం హార్డ్ వేర్ తయారీలో కీలకం కానున్నాయి. ఈ రెండు చోట్లా మైనస్ 273 సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలో క్వాంటం కంప్యూటర్లు పనిచేయనున్నాయి. క్వాంటం కంప్యూటర్లలో ఉపకరించే వివిధ పరికరాలను టెస్ట్ చేసేలా ఈ రిఫరెన్సు ఫెసిలిటీలు తోడ్పాటు అందించనున్నాయి. క్వాంటం టెక్నాలజీలో కేవలం సాఫ్ట్‌వేర్ అల్గారిథమ్స్ తో పాటు హార్డ్‌వేర్ తయారీలోనూ స్వయం సమృద్ధి సాధించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయం. ఇందులో భాగంగా క్వాంటం కంప్యూటర్లకు అవసరమైన పరికరాలను తయారు చేయాలని కూడా లక్ష్యంగా నిర్దేశించారు. ఇటీవలే 30కి పైగా క్వాంటం హార్డ్ వేర్ తయారీ సంస్థలతో ముఖ్యమంత్రి సమావేశం కూడా నిర్వహించారు. అమరావతిలో ఏర్పాటు అవుతున్న క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీ భారత్ లో క్వాంటం హార్డ్‌వేర్ నెట్‌వర్క్‌కు యాంకర్ నోడ్ గా తీర్చిదిద్దాలని లక్ష్యంగా నిర్దేశించారు. క్వాంటం తయారీ రంగంలో క్రయోజెనిక్స్ లాంటి సాంకేతికతలను ఉపయోగించి ప్రెసిషన్ ఎలక్ట్రానిక్స్, క్వాంటం గ్రేడ్ ఫ్యాబ్రికేషన్ లాంటి రంగాల్లో స్వదేశీ క్వాంటం కంప్యూటింగ్ ఉపకరణాల తయారీకి కేంద్రంగా అమరావతి మారాలన్నది ఈ ఆలోచన ముఖ్య ఉద్దేశం. ఇక్కడ పరీక్షించిన క్వాంటం కంప్యూటింగ్ పరికరాలకు సర్టిఫికేషన్ ఇచ్చేలా ఈ టెస్ట్ ఫెసిలిటీలను సిద్ధం చేశారు.

**ఆధునిక గ్లోబల్ టెక్ హబ్ గా ఏపీ :** అమరావతిని ప్రపంచంలోని మొదటి 5 క్వాంటం హబ్‌లలో ఒకటిగా తీర్చిదిద్దేలా రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తోంది. దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం క్వాంటం కంప్యూటింగ్ పాలసీ 2025-30ని కూడా విడుదల చేసింది. గత ఏడాది జూన్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్వాంటం డిక్లరేషన్ ను కూడా ప్రకటించారు. అమరావతిలోని ఉద్దండరాయుని పాలెం వద్ద 50 ఎకరాల్లో ఏక్యూఏసీ కేంద్రం నిర్మితం అవుతోంది. ఆరు టవర్లుగా నిర్మిస్తున్న ఈ భవనాల్లో అంతర్జాతీయ టెక్ దిగ్గజం ఐబీఎం భాగస్వామ్యంతో అత్యంత శక్తివంతమైన 133 క్యూబిట్, 5 కే గేట్ క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు కానుంది. ఐబీఎంతో పాటు టీసీఎస్, ఎల్ అండ్ టీ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు అమరావతి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం ఏర్పాటులో కీలక పాత్ర పోషిస్తున్నాయి. టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్, కేంద్ర ప్రభుత్వంలోని సీఐఎస్ఆర్ నేతృత్వంలోని నేషనల్ టెస్టింగ్ ల్యాబ్ లాంటి సంస్థలు కూడా దీనికి సహకారాన్ని అందిస్తున్నాయి. నూతన ఔషధాల ఆవిష్కరణ, సంక్లిష్ట వ్యాధులకు వ్యాక్సీన్ల ఉత్పత్తిలో వేగం, వెదర్ మోడలింగ్, సెమీ కండక్టర్ల పాలన, లాజిస్టిక్స్ రంగాల్లో డేటా అనలటిక్స్, రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో కీలకమైన పరిశోధనలు చేసేలా దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్ అమరావతిలో త్వరలోనే ఆవిష్కృతం కానుంది. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం నుంచి పరిశోధనలు, ఆవిష్కరణల కోసం ఇప్పటికే 80కి పైగా అంతర్జాతీయ స్థాయి కంపెనీలు, విద్యా సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. క్వాంటం కంప్యూటింగ్ అల్గారిథమ్స్ లో నిపుణులైన మానవ వనరులను సిద్ధం చేసేందుకు ఐఐటీ చెన్నై, వైసర్ లాంటి సంస్థలతో ప్రభుత్వం భాగస్వామ్యం కూడా కుదుర్చుకుంది. క్వాంటంలో నైపుణ్యాల కోసం ఇప్పటికే 60 వేల మంది శిక్షణ పొందుతున్నారు. వచ్చే ఐదేళ్లలో 45 లక్షల మందిని క్వాంటం నిపుణులుగా తీర్చిదిద్దేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది.

# దీపం లబ్ధిదారులకు పీఎన్‌జీ వరం



(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. వచ్చే 6 నెలల్లో మొత్తం 10 లక్షల పీఎన్జీ కనెక్షన్లు ఇవ్వాలని... ఈ విషయంలో జాప్యం ఉండకూడదని, టార్గెట్ ఎట్టిపరిస్థితుల్లో చేరుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గృహ అవసరాలకు సంబంధించి గ్యాస్ సరఫరాలో సమస్యలను అధిగమించామని తెలిపారు. డొమస్టిక్ పంపిణీకి సంబంధించి సమస్యను తగ్గించామని... త్వరలో సాధారణ స్థితికి తీసుకువస్తామన్నారు. శ్రీకాకుళం - కాకినాడ నేచురల్ గ్యాస్ పైప్ లైన్ పనుల్లో జాప్యంపై సీఎం అధికారుల వివరణ కోరారు. దీనికి సంబంధించి కేంద్రం కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందని అధికారులు చెప్పడంతో... సమీక్ష నుంచే కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరికి ముఖ్యమంత్రి ఫోన్ చేశారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి అయినందున వెంటనే పనులు పూర్తి చేసేలా చూడాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి త్వరలోనే సమీక్షించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఫుడ్ సేఫ్టీ శిక్షణ కార్యక్రమం నిర్వహణ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ప్రతి వ్యాపారస్తుడు ఆహార భద్రతపై అవగాహన కలిగి ఉండటం అత్యవసరమని భావిస్తూ, 2017 నుంచి ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ అండ్ సర్టిఫికేషన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు . ఈ కార్యక్రమంలో భాగంగా గుంటూరులో శిక్షణ తరగతులు నిర్వహించబడ్డాయన్నారు . ఈ కార్యక్రమం లో భాగంగాఆంధ్రప్రదేశ్ జాయింట్ ఫుడ్ కంట్రోలర్ ఎన్. పూర్ణచంద్రరావు ఆదేశాల మేరకు నోడల్ ఆఫీసర్ వేణుగోపాలరావు సూచనలతో గుంటూరు జిల్లా కృష్ణానగర్ రెండో లైన్‌లోని ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ కార్యాలయంలో పలు హోటల్ వ్యాపారస్తులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ తరగతులకు శిక్షకుడు కలకండ ప్రవీణ్ కుమార్ హాజరై మాట్లాడారు. ఆహార తయారీ సమయంలో పాటించాల్సిన పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలు, సరైన విధానాల గురించి వివరంగా సూచనలు అందించారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందించడం ప్రతి వ్యాపారస్తుడి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. అనంతరం, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టంలోని సెక్షన్ 31 ప్రకారం ప్రతి వ్యాపారస్తుడు ఫుడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకుని వ్యాపారం చేయాలని తెలిపారు. అలాగే ఆహార తయారీలో ఉపయోగించే నీటి నాణ్యతపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

ఫుడ్ లైసెన్స్ పొందాలనుకునే వ్యాపారస్తులు కృష్ణానగర్ మొదటి లైన్‌లో బాలాజీ హాస్టల్ ఎదుట ఉన్న ఫుడ్ సేఫ్టీ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. అలాగే నీటి నమూనాల పరీక్షల కోసం గుంటూరు రీజినల్ ల్యాబొరేటరీని సంప్రదించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా జోనల్ హెడ్ గజ్జలకొండ సాయినాథ్, జంపుల నవీన్, కార్యాలయ సిబ్బంది ప్రవళికతో పాటు పలువురు వ్యాపారస్తులు పాల్గొన్నారు.

# యువత సవాళ్లను స్వీకరిద్దాం



(మొదటి పేజీ తరువాయి)

ఈ రోజు సత్వా గ్రూప్ ఏపీ, విశాఖ అభివృద్ధిలో భాగస్వామ్యం కాబోతోంది. అలా ఈ అనుబంధం ప్రారంభమైంది. అందుకే ఈ రోజు మీ ముందుకు వచ్చి మాట్లాడే అవకాశం నాకు లభించింది. ఈ క్యాంపస్‌ను, మీ మౌలిక సదుపాయాలను, మీ విజయాలను, మీ ప్రపంచ దృష్టిని చూసినప్పుడు.. గ్రీన్‌వుడ్ హై ఇంటర్నేషనల్ స్కూల్ వంటి సంస్థలు అత్యున్నత ప్రమాణాలతో గ్లోబల్ సిటిజన్స్ ను తయారు చేస్తున్నాయని గర్వంగా అనిపిస్తోంది.

**ఏం నేర్చుకున్నారన్నది కాదు.. ఎలా ఆలోచిస్తున్నారనేది ముఖ్యం :** ఇక్కడకు రావడం వల్ల నా పాత రోజులు గుర్తుకువస్తున్నాయి. నేను కార్నెగీమెలన్ యూనివర్సిటీలో, తర్వాత స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో చదివిన రోజుల్ని గుర్తు చేసుకుంటున్నాను. అవి కలలు, ఆశయాలు, అనిశ్చితితో నిండిన రోజులు. కానీ నేను ఎంతో స్పష్టంగా నేర్చుకున్న ఒక విషయం ఉంది. విద్య అనేది మీరు ఏం నేర్చుకుంటారన్నది మాత్రమే కాదు. మీరు ఎలా ఆలోచించడం నేర్చుకుంటారన్నదే ముఖ్యం. అదే విషయం నాకు ఇక్కడ కూడా కనిపిస్తోంది. పరీక్షల కోసం మాత్రమే కాదు, జీవితానికి సిద్ధం చేసే ఒక విధానం.

**ట్రెండ్ ను అనుసరించకుండా లక్ష్యంపై దృష్టిపెట్టాలి :** మీలో ఎంతమంది డాక్టర్లు, ఇంజనీర్లు, కావాలనుకుంటున్నారు? మీలో ఎంతమంది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల వైపు చూస్తున్నారు? ఎంతమంది వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు కావాలనుకుంటున్నారు? మీరు ఏ దారిని ఎంచుకున్నా ఒక విషయాన్ని గుర్తుంచుకోండి. ట్రెండ్స్‌ను అనుసరించకండి, మీ లక్ష్యాన్ని అనుసరించండి. ఎందుకంటే ట్రెండ్స్ మారిపోతాయి... కానీ లక్ష్యం మాత్రం నిలిచే ఉంటుంది. ఎప్పుడూ ఇతరులు నడవని దారినే ఎంచుకోండి.

**యువత సవాళ్లను స్వీకరించి ముందుకు సాగాలి :** మీరు నన్ను ఈ రోజు ఒక మంత్రిగా చూస్తున్నారు. కానీ జీవితం ఎప్పుడూ ఒకేలా ఉండదు. 2017-19 వరకు నేను పంచాయతీరాజ్, ఐటీ ఉ ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ శాఖ మంత్రిగా పనిచేశాను. ఒక గదిలో కూర్చొని నిర్ణయం తీసుకుంటే.. ఎక్కడో దూరంగా ఉన్న గ్రామంలో, ఎవరో ఒకరి జీవితం మారిపోతుంది. అదే రెస్పాన్స్ బులిటీ పవర్. ఒక్కోసారి జీవితం మనల్ని పరీక్షిస్తుంది కూడా. 2019 ఎన్నికల్లో మంగళగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయాను. దాదాపు నాలుగు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీ గెలవని నియోజకవర్గం అది. ఆ సవాల్ నుస్వీకరించా. కానీ ఓడిపోయా. ఆ క్షణం ఎంతో బాధపడ్డా. ఆ ఓటమి నాలో కసి పెంచింది. వెనక్కి తగ్గకూడదని నిర్ణయించుకుని ముందుకు సాగాను. 2023లో ఏపీ వ్యాప్తంగా 3,132 కిలోమీటర్లకు పైగా యువగళం పేరుతో పాదయాత్ర చేశా. ఏడాదిపాటు గ్రామాలు, పట్టణాలు, పొలాలు, వీధుల్లో నడిచా. రైతులు, మహిళలు, యువత, ప్రభుత్వ ఉద్యోగులు, చిరు వ్యాపారులు, మెకానిక్ లను కలిశా. ఆ ప్రయాణం నన్ను పూర్తిగా మార్చేసింది. ఎందుకంటే అప్పటి వరకు పాలనను వ్యవస్థ దృష్టితో చూశా. కానీ ఆ ప్రయాణంలో జీవితాన్ని ప్రజల దృష్టితో చూశా. ఆ రెండు చాలా భిన్నమైనవి. తర్వాత మరో అధ్యాయం ప్రారంభమైంది.

**మంగళగిరిలో గెలుపు ప్రజల నమ్మకానికి నిదర్శనం :** 2024లో జరిగిన ఎన్నికల్లో మంగళగిరి నియోజకవర్గం నుంచే తిరిగి పోటీ చేశా. అదే మంగళగిరి, అదే ప్రజలు. కానీ ఈసారి మరింత లోతైన అవగాహన, మరింత బలమైన నమ్మకంతో వెళ్లి విజయం సాధించాం. గెలవడమే కాదు... మంగళగిరిలో 91,413 ఓట్ల మెజారిటీ సాధించాం. ఇది రాష్ట్రంలో మూడో అత్యధిక మెజారిటీ. 1985 తర్వాత తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ గెలవని నియోజకవర్గంలో ఇది జరిగింది. ఆ విజయం నాది కాదు. ప్రజల నమ్మకానికి నిదర్శనం. వినడానికి చేసిన ప్రయత్నానికి ఫలితం. ప్రజలతో నిజాయితీగా మమేకమైనప్పుడు మార్పు తప్పకుండా వస్తుందని నిరూపించింది.

**షార్ట్‌కట్‌ల ప్రపంచంలో నైతికతే గొప్ప బలం :** 'కొత్త అవకాశాలకు నాంది పలకడం' అంటే ఎప్పుడూ పూర్తిగా కొత్తదేదైనా సృష్టించడం మాత్రమే కాదు. కొన్నిసార్లు అది ఇతరులు చూడలేని దానిని చూడటం. ఇతరులు పట్టించుకోనప్పుడు వినటం, కూర్చోవడం సులభమైనప్పుడు నిలబడటం. నేను విద్యార్థులకు ఎప్పుడూ ఒక విషయం చెబుతా. ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు గారు అమ్మకు చెప్పలేని పని జీవితంలో ఎప్పుడు చేయవద్దని సూచించారు. మీ జీవితంలో ప్రతి నిర్ణయం ఈ పరీక్షను దాటితే.. మీరు ఎప్పుడూ తప్పుదారిలో వెళ్లరు. ఎందుకంటే ఈ షార్ట్‌కట్‌ల ప్రపంచంలో... నైతికతే మీ గొప్ప బలం.

**ఎవరూ చూడనప్పుడు మీరేం చేస్తారో అదే మీ వ్యక్తిత్వం :** స్టాన్‌ఫోర్డ్‌లో మేము పరీక్షలు ఇన్విజిలేటర్లు లేకుండానే రాసేవాళ్లం. ఎవరూ గమనించేవారు కాదు. కూర్చొని పరీక్ష రాసి బయటకు వచ్చేవాళ్లం. అప్పుడు నిజాయతీ తప్ప చీటింగ్ చేయకుండా ఎవరూ ఆపలేరు. ఆ విధమైన వ్యవస్థ మా జ్ఞానాన్ని కాకుండా వ్యక్తిత్వాన్ని పరీక్షించింది. ఆ పాఠం నాకు జీవితాంతం గుర్తుండిపోయింది. ఎవరూ చూడనప్పుడు మీరు ఏం చేస్తారో అదే మీ వ్యక్తిత్వం. ఇంకో ఆసక్తికరమైన పద్ధతి కూడా ఉండేది. మాకు ఒక బోర్డు ఉండేది. అందులో విద్యార్థులు తాము ఏ విషయం గురించి తెలుసుకోవాలనుకుంటున్నారో బోర్డుపై రాసేవారు. ఉదాహరణకు నాకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ఆసక్తి ఉంటే, అక్కడ రాస్తాను. అప్పుడు ఇంకొకరు వచ్చి మనిద్దరం కలిసి నేర్చుకుందాం అంటారు. అదే కలిసి పనిచేయడంలో, నేర్చుకోవడంలో ఉన్న శక్తి. గ్రీన్‌వుడ్ హై వంటి సంస్థల్లో మీరు నిర్మించుకునే బంధం అదే.

**విద్యార్థులు నైతిక విలువలు అలవర్చుకోవాలి :** ఈ రోజు మీరు అడుగుపెడుతున్న ప్రపంచం ఇంతకు ముందెన్నడూ లేనంత వేగంగా మారుతోంది. సాంకేతికత రోజురోజుకీ అభివృద్ధి చెందుతోంది. ఉద్యోగాలు మారుతున్నాయి. పరిశ్రమలే మారిపోతున్నాయి. మీరు భవిష్యత్తులో చేసే కొన్ని ఉద్యోగాలు.. ఈ రోజు ఇంకా లేవు కూడా. అయితే మీకు పరిస్థితులకు అనుగుణంగా మారగల సామర్థ్యం, కష్టాలను ఎదుర్కొని మళ్లీ నిలబడగలికే ధైర్యం, తెలుసుకోవాలనే ఆసక్తి, నైతిక విలువలు అవసరం. ఎందుకంటే జ్ఞానం మారుతుంది కానీ ఈ విలువలు మాత్రం మారవు.

**ప్రపంచ పౌరులను తయారు చేసే పాఠశాల ఇది :** ఈ రోజు తల్లిదండ్రుల రోజు కూడా. ప్రతి విజయవంతమైన విద్యార్థి వెనుక త్యాగం, సహనం, నిస్వార్థమైన మద్దతు ఉంటుంది. ఉపాధ్యాయులు భవిష్యత్ నిర్ణేతలు. ఉపాధ్యాయులు కేవలం పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా జీవితాలను తీర్చిదిద్దుతారు. గ్రీన్‌వుడ్ హై ఒక అద్భుతమైన సంస్థను నిర్మించింది. జ్ఞానం, జీవన నైపుణ్యాలు, మీలాంటి ఆత్మవిశ్వాసంతో కూడిన ప్రపంచ పౌరులను తయారు చేసే పాఠశాల ఇది. ఈ రోజు డిప్లొమాను అందుకునే విద్యార్థులు.. రేపు మీరు మీ బాధ్యతను అందుకుంటారు. మీ కుటుంబం, సమాజం, దేశం పట్ల బాధ్యతగా ఉండాలి. మీరు ముందుకు సాగే క్రమంలో మూడు విషయాలు గుర్తుంచుకోవాలి. పెద్ద కలలు కనండి, కానీ నేల మీదే ఉండండి. కష్టపడండి, కానీ నైతిక విలువలను విస్మరించవద్దు. విజయాలు సాధించండి కానీ ఇతరులను కూడా మీతో తీసుకెళ్లండి. ఎందుకంటే నిజమైన విజయం అనేది మీరు ఒంటరిగా సాధించేది కాదు.. ఇతరులకు మీరు సృష్టించే అవకాశమే. 2026 బ్యాచ్ విద్యార్థులు కేవలం గ్రాడ్యుయేట్లు మాత్రమే కాదు... మార్గదర్శకులు. అడ్డంకులను ఛేదించి ముందుకు సాగాలని ఈ సందర్భంగా మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సత్వగ్రూప్ ఎండీ, గ్రీన్‌ఉడ్ హై ఇంటర్నేషనల్ స్కూల్ ఛైర్మన్ బిజయ్ అగర్వాల్, ప్రిన్సిపల్ షీలా అలెగ్జాండర్, వైస్ ప్రిన్సిపల్ నిషాంత్ నగవర్, మేనేజింగ్ ట్రస్టీ శ్రీమతి నీరు అగర్వాల్, ట్రస్టీ ఎన్. మెహ్రోత్ర, ఐబీడీపీ కోఆర్డినేటర్ ఎస్. కావ్య తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ బలోపేతానికి ప్రణాళిక



(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రణాళికలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంపు, పార్టీ సిద్ధాంతాల ప్రచారం, కొత్త సభ్యుల చేరిక వంటి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశం అనంతరం రాష్ట్రంలో పార్టీ కార్యకలాపాలకు మరింత ఊతం లభిస్తుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జాతీయ సంఘటనా ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, జాతీయ సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్, రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నాగోతు రమేష్ నాయుడు, సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగలి గోపి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయ శాఖ పటిష్టతకు చర్యలు



(మొదటి పేజీ తరువాయి)

భాగంగా మంత్రులు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడారు. అనవసరమైన వ్యాజ్యాలను తగ్గించడానికి, కేసుల పరిష్కార వేగవంతానికి, పాలన సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, పరిపాలనా స్థాయిలో వివిధ పద్ధతులను సమీక్షించి మంత్రుల సంఘం సూచనలు చేస్తుందని మంత్రి తెలిపారు. ముందస్తు కేసు నిర్వహణ ద్వారా అప్పీళ్లను న్యాయంగా దాఖలు చేయడానికి, విధానపరమైన జాప్యాలను తొలగించడానికి చర్యలను కూడా మంత్రుల సంఘం సూచిస్తుందని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ వివాద పరిష్కారాన్ని సమీక్షించడం, ప్రోత్సహించడం, లోక్ అదాలత్‌లను సంస్థాగతీకరించడం తదితర అంశాలపై కూడా పూర్తి స్థాయిలో దృష్టి సారించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. న్యాయశాఖ ను మరింత పటిష్టం చేసేందుకు ప్రణాళిక బద్ధంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరుగుతుందని న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలలో ఇప్పటికే అమల్లో ఉన్న లిటిగేషన్ పాలసీని పరిశీలించి, అక్కడ చేపట్టిన చర్యలు, సంస్కరణలు, ఇతర అంశాలను కూలంకషంగా పరిశీలించి, మన రాష్ట్రంలో లిటిగేషన్ పాలసీని పటిష్టంగా అమలు చేయాలని మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో పాల్గొన్న మంత్రులు ఫరూక్, అనిత, సత్య కుమార్ లు సూచించారు. ఈ సమావేశంలో న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభా దేవి, సిబ్బంది పాల్గొన్నారు.

# రెవెన్యూకు 'జవసత్వాలు'!



(మొదటి పేజీ తరువాయి)

ఇందుకు అవసరమైన కొత్త చట్టాలు తెచ్చారు. పనికిరాని చట్టాల్ని రద్దు చేశారు.

**ఆ ఐదేళ్లూ రెవెన్యూ శాఖ నిర్వీర్యం :** ప్రజలకు నేరుగా సంబంధమున్న, అత్యంత దగ్గరైన శాఖల్లో రెవెన్యూ శాఖ ముందు వరుసలో ఉంటుంది. కుల ధృవీకరణ పత్రం నుంచి ఆదాయం, జనన, మరణ ధృవపత్రాల వరకు..., పట్టాదార్ పాస్ పుస్తకాల నుంచి భూ సంబంధిత సేవల వరకూ తెల్లారితే రెవెన్యూ ఆఫీసుకే వెళ్తాం.... అంత కీలకమైన శాఖను గత ప్రభుత్వం ఎలా భ్రష్టుపట్టించిందో, ప్రజలను ఎంతలా ఇబ్బంది పెట్టిందో తెలిసిందే. ఒక వ్యవస్థ మొత్తాన్ని విధ్వంసం చేసిన తొలి ప్రభుత్వంగా రాష్ట్ర చరిత్రలో వైసీపీ సర్కార్ నిలిచిపోయింది. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి... ఐదేళ్లలో రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కి తీసుకువెళ్లిన దౌర్భాగ్య పాలన వైసీపీది. ఎక్కడ చూసినా భూ కబ్జాలు, దందాలు, రికార్డుల ట్యాంపరింగ్, ఫైళ్ల దహనం, ప్రైవేట్ భూములకు రక్షణ లేని పరిస్థితి తీసుకొచ్చారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో భయాందోళన కలిగించారు. రీ సర్వే పేరు చెప్పి కొత్త సమస్యలు సృష్టించారు.

**కుటుంబాల మధ్య చిచ్చు పెట్టారు :** తమ అక్రమాలకు, అవినీతి కూడా నాటి పాలకులు రీ సర్వేను వేదికగా చేసుకున్నారు. భూ వివాదాల కారణంగా కుటుంబాలు విడిపోయేంతలా గత ప్రభుత్వంలో వ్యవహరించారు. 22ఏ జాబితాతో ఇబ్బందులు కలిగించారు. ఇక్కడితో ఆగలేదు... అటవీ భూముల ఆక్రమించడం, ఫాం హౌస్‌లు కట్టుకోవడం వంటివి నిస్సిగ్గుగా చేశారు. ప్రైవేటు ఆస్తులు, ప్రజల భూములను వాళ్ల ఆస్తులు అన్నట్టుగా పట్టాదారు పాస్ పుస్తకాలు, సర్వే రాళ్ల పైనా నాటి పాలకులు బొమ్మలు వేయించుకున్నారు. రైతుకు భూమితో బంధం లేకుండా కుట్ర చేశారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాలతో ప్రతీ ఒక్కరూ మానసిక క్షోభకు గురయ్యారు. వ్యవస్థను నాశనం చేయడమే కాదు... సర్వే రాళ్లపై వారి బొమ్మలకు రూ.660 కోట్లు తగలేశారు. పట్టాదారు పాసుపుస్తకాలపై తమ బొమ్మలకు రూ.22 కోట్లు ఖర్చు చేశారు. అందుకే బొమ్మల పిచ్చోళ్లకు ఎన్నికల్లో జనం బొమ్మ చూపించారు.

**హామీ నిలబెట్టుకున్న ప్రజా ప్రభుత్వం :** ఎన్నికల ముందు ప్రజల ఆస్తులు, భూముల భద్రత విషయంలో ఎన్డీఏ కూటమి స్పష్టమైన హామీ ఇచ్చింది. అందరి ఆవేదన అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజల ఆస్తులకు భద్రత, వారి భవిష్యత్‌కు భరోసా కల్పించాలని సంకల్పించారు. నాడు ప్రజల మధ్యనే వాళ్ల బొమ్మలతో ఉన్న పట్టాదార్ పాసు పుస్తకాలు చించి... మీకు న్యాయం చేస్తానని ప్రకటించారు. చెప్పినట్లుగానే అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రెండో సంతకంతోనే రద్దు చేశారు. అధికారం చేపట్టే నాటికి అస్తవ్యస్థంగా ఉన్న రెవెన్యూ శాఖను పూర్తి స్థాయిలో సంస్కరించి, గాడిలో పెట్టాలని ఆరోజే ముఖ్యమంత్రి నిర్ణయించారు. భూ ఆక్రమణదారుల నుంచి ప్రజల ఆస్తులను రక్షించేందుకు 'ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిటెడ్ యాక్ట్-2024 నవంబర్‌లో తీసుకొచ్చారు. నాటి నుంచి నేటి వరకు 22 నెలల పాలనలో రెవెన్యూ శాఖలో పెను మార్పులు తీసుకువచ్చారు. ప్రజలకు దగ్గర చేశారు. అవినీతికి ఆస్కారం లేకుండా వాట్సప్ గవర్నెన్స్ 'మన మిత్ర' ద్వారా మొబైల్ నుంచే రెవెన్యూ సేవలు అందించేలా శ్రీకారం చుట్టారు. ఏ సర్టిఫికెట్లకు ఆఫీసుల చుట్టూ తిరిగే పని లేకుండా ప్రజా ప్రభుత్వం చేసింది. దీని వల్ల అవినీతికి ఆస్కారం లేకుండా పోవడమే కాదు, వేగంగా సేవలూ అందుతున్నాయి. వ్యవసాయేతర అవసరాలకు భూమిని సులభంగా మార్చుకునేలా నాలా చట్టం కూడా రద్దు చేసింది. 77 లక్షల సర్వే రాళ్లపై బొమ్మలను తొలగించింది.

**17 వేల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు :** భూ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్రంలోని మొత్తం 17 వేల గ్రామాల్లో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. ఆర్ ఓ ఆర్, ఎఫ్ లైన్లు, రీసర్వే, అసైన్మెంట్లు వంటి దాదాపు 29 అంశాలపైన ఫిర్యాదులు రాగా వాటన్నింటికి పరిష్కారం చూపింది. 22 ఏ భూముల జాబితా నుంచి ప్రైవేట్ భూములు తొలగించడం ద్వారా ఉపశమనం కలిగించింది. మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ బాధితులు... వీరికి నిర్దేశించిన 8 డాక్యుమెంట్లలో ఒక్క ఆధారం ఉన్నా నిషేధిత జాబితా నుంచి తప్పించింది. భూ సమస్యలపై అప్పీల్ పరిష్కరించే అధికారం డీఆర్వో నుంచి ఆర్డీవోకు బదలాయించారు. అభ్యంతరాలేని ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదల నివాసాలు రెగ్యులరైజ్ చేస్తున్నారు. రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ ప్రవేశ పెట్టడంతో రిజిస్ట్రేషన్ సమయం ఆదా అవుతోంది. అలాగే, జూన్ 2024 నుంచి ఇప్పటివరకు 9 లక్షల భూ లావాదేవీలు ఆటో మ్యూటేషన్ జరిగింది. సేల్, గిఫ్ట్, పార్టీషన్ డీడ్స్‌లో 100 శాతం ఆటో మ్యూటేషన్ చేస్తున్నారు. అర్బన్ ప్రాంతాల్లో కూడా ఆటో మ్యుటేషన్ విధానం తీసుకువచ్చారు.

**రీ సర్వేతో భూ వివాదాలకు చెక్ :** భూ వివాదాలకు శాశ్వత పరిష్కారంగా ప్రజా ప్రభుత్వం రీ సర్వే 2.0 చేపట్టింది. మొత్తం 16,816 గ్రామాల్లో రీ సర్వేకు చేపట్టగా, ఇప్పటికే 6,976 గ్రామాల్లో సర్వే ముగిసింది. 2027 మార్చి నాటికి రాష్ట్రమంతా రీ సర్వే పూర్తి చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. గత పాలకుడి ఫోటో తీసేసి రాజముద్రతో కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇస్తున్నారు. ప్రతీ నెలా 9వ తేదీన 'మీ భూమి-మీ హక్కు' నిర్వహిస్తున్న కార్యక్రమానికి ముఖ్యమంత్రి స్వయంగా హాజరవుతున్నారు. భూ యజమానులకు సీఎం తన చేతుల మీదుగా పాస్ పుస్తకాలు అందజేస్తున్నారు. 2027 మార్చికి 1.12 కోట్ల పాసు పుస్తకాల పంపిణీ లక్ష్యంగా చేసుకున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు మొత్తం 22.79 లక్షల కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ చేశారు. అత్యంత భద్రతా ప్రమాణాలతో ఈసారి పట్టాదార్ పాస్ పుస్తకాలను ప్రభుత్వం ముద్రిస్తోంది. ప్రతీ పాస్ పుస్తకానికి ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్, యునిక్ నెంబర్ ఉంటుంది. ఎవరైనా సరే ఈ క్యూఆర్ కోడ్ ద్వారా భూమి వివరాలను తెలుసుకునే అవకాశాన్ని కల్పించింది. భూ రికార్డులు సరిగ్గా ఉన్నాయో, లేవో... రియల్ టైంలో చెక్ చేసుకోవచ్చు. అన్ని వివరాలు సరిగ్గా ఉన్నాయని భూ యజమాని ఈ కేవైసీ ద్వారా నిర్ధారించాకే నేరుగా ఇంటికే పాస్ పుస్తకం అందిస్తున్నారు. గతంలో తాహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు మారిస్తే ఎప్పటికో బయటపడేవి. ఇప్పుడు ఒక్క స్కానింగ్‌తోనే రికార్డులు పరిశీలించుకోగలుగుతున్నారు. అలాగే, రికార్డులు మరింత భద్రంగా ఉండేలా బ్లాక్ చెయిన్ టెక్నాలజీని, రికార్డుల లాకర్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది.

**నాన్‌స్టాప్‌గా సంస్కరణలు :** 1.37 లక్షల ఎకరాల విలేజ్ సర్వీస్ ఈనాం భూములను 22 ఏ నుంచి తొలగిస్తూ ఇటీవల ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. ఇతర సర్వీస్ ఈనాంలోని మరో లక్ష ఎకరాల భూములకూ త్వరలో విముక్తి కల్పించనున్నారు. నిజానికి 2019లో దీనిపై ఆర్డినెన్స్ తీసుకువచ్చినప్పటికీ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మురిగిపోయింది. మళ్లీ ఇప్పుడు దీనికి సంబంధించి ప్రభుత్వం కొత్తగా చట్టం తీసుకురానుంది. అలాగే 22 ఏ పై కలెక్టర్ అధికారాలను వికేంద్రీకరిస్తోంది. జేసీ, ఆర్డీవోలకు అధికారాలు బదలాయిస్తోంది. దీంతో రెవెన్యూ సమస్యలు, అర్జీలు త్వరగా పరిష్కారమవుతాయి. వెబ్ ల్యాండ్ తప్పులు సుమోటోగా సరిదిద్దేలా ఆర్డీవోలు, తహశీల్దారులకు అధికారం ఇస్తోంది. మరోవైపు ఫ్రీహోల్డ్‌లో 13.59 లక్షల ఎకరాలు ఉంటే వీటిలో అర్హత కలిగిన 9.25 లక్షల ఎకరాల భూములకు పూర్తి యాజమాన్య హక్కులు ఇవ్వాలని ముఖ్యమంత్రి ఇప్పటికే అధికారులకు సూచించారు. త్వరలో స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో భూ వినియోగ మార్పులు, మిస్సింగ్ సర్వే నంబర్ల సేవలు ప్రారంభం కానున్నాయి. వారసత్వంగా వస్తున్న భూముల విషయంలోనూ సంస్కరణలు తెచ్చారు. రూ.10 లక్షల లోపు ఆస్తులకు రూ.100, రూ.10 లక్షల పైబడి ఆస్తులకు రూ.1,000తోనే రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించారు. మొత్తంగా 2027 నాటికి భూ సమస్యలు అనేవి లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి పట్టుదలగా పనిచేస్తున్నారు.

## ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ఏపీ జేఏసీ అమరావతి హర్షం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన పెండింగ్ బిల్లుల చెల్లింపులను ప్రభుత్వం చేస్తుండడంపై ఏపీ జేఏసీ అమరావతి హర్షం వ్యక్తం చేసింది. ఉద్యోగ సంఘాల సమావేశంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు వివిధ బకాయిల చెల్లింపులకు అనుమతి ఇవ్వడాన్ని స్వాగతిస్తూ ప్రభుత్వం పట్ల కృతజ్ఞతలు తెలిపింది.

ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర నాయకత్వం పలుమార్లు మంత్రివర్గ ఉపసంఘం, ఆర్థిక శాఖ మరియు ఉన్నతాధికారులతో చర్చలు జరిపి పెండింగ్ బిల్లుల సమస్యను వివరించిన విషయం తెలిసిందే. ముఖ్యంగా రిటైర్డ్ ఉద్యోగులు, మరణించిన ఉద్యోగుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఇటీవల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఆర్థిక శాఖ దృష్టికి తీసుకెళ్లగా, దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి చెల్లింపులు అనుమతించింది.

గత రెండు రోజులుగా ముఖ్యంగా రిటైర్డ్ ఉద్యోగులకు ప్రాధాన్యతనిస్తూ బిల్లుల చెల్లింపులు కొనసాగుతున్నాయని, ఇంకా ఈ ప్రక్రియ వేగంగా కొనసాగేందుకు నిధులు విడుదల చేస్తున్నట్లు జేఏసీ పేర్కొంది. ఈ నిర్ణయంపై ఆర్థిక శాఖ పాత్రను ప్రత్యేకంగా అభినందించింది.

ప్రభుత్వం విడుదల చేస్తున్న ప్రయోజనాల్లో భాగంగా గ్రాట్యుటీ కింద 59,874 మందికి రూ. 3,612.03 కోట్లు, ఏపీ జి.ఎల్.ఐ కింద 4,984 మందికి రూ. 79.05 కోట్లు, జీ.పి.యఫ్ కింద 32,399 మందికి రూ. 1,940.13 కోట్లు, సరెండర్ లీవ్ ఎన్‌కాష్‌మెంట్ కింద 21,720 మందికి రూ. 1,111.76 కోట్లు విడుదల చేస్తున్నట్లు తెలిపింది. అదనంగా పోలీస్ విభాగానికి చెందిన అదనపు సరెండర్ లీవ్ కింద 66,607 మందికి రూ. 236.87 కోట్లు ఈరోజు, రేపట్లో ఖాతాల్లో జమ కానున్నాయి.

మొత్తం 1,85,584 మంది లబ్ధిదారులకు సుమారు రూ. 6,979.85 కోట్లు విడుదల చేస్తున్నట్లు వెల్లడించింది. భవిష్యత్తులో కూడా పెన్షనర్లు, ఉద్యోగుల పెండింగ్ ప్రయోజనాలు త్వరితగతిన చెల్లింపులు జరిగేలా ప్రభుత్వం తో చర్చలు కొనసాగిస్తామని ఏపీ జేఏసీ అమరావతి స్పష్టం చేసింది. ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమం కోసం తమ పోరాటం కొనసాగుతుందని పేర్కొంది.

## వ్యవసాయ శాఖలోని ఎంపిఎఓలకు కనీస టైమ్ స్కేల్ అమలు చేయాలి



- మంత్రి అచ్చెన్నాయుడిని విజ్ఞప్తి చేసిన లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ముహమ్మద్ కరిముల్లా

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** వ్యవసాయశాఖలో గత అనేక సంవత్సరాలుగా కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న 1359 మంది మల్టీపర్పస్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్లు సమస్యలను పరిష్కరించాలని లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ముహమ్మద్ కరిముల్లా వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడికి విజయవాడలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముహమ్మద్ కరిముల్లా మాట్లాడుతూ, వ్యవసాయశాఖలో పనిచేస్తున్న 1359 మంది వీరు రైతులకు పంటల సాగు సలహాలు, ప్రభుత్వ పథకాల అమలు, ఎరువులు, పురుగు మందుల వినియోగంపై అవగాహన, మైదాన స్థాయి సమస్యల పరిష్కారం వంటి కీలక బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. రైతాంగానికి వీరి సేవలు అత్యంత అవసరం. అయినప్పటికీ, వారు చాలా కాలంగా కాంట్రాక్ట్ వేతనాలతోనే పనిచేయాల్సి వస్తోంది. దీంతో వారి కుటుంబాల జీవనాధారంపై తీవ్ర ప్రభావం పడుతోంది అన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు సమస్యను సానుకూలంగా పరిశీలించి, త్వరలో అనుకూల నిర్ణయం తీసుకునేందుకు కృషి చేస్తానని ముందు జీతాలు పెంచుతానని హామీ ఇచ్చినట్లు ముహమ్మద్ కరిముల్లా తెలిపారు. ఈయన తో పాటు రాజేంద్ర ఎంప్లాయిస్ లీడర్ కూడా ఉన్నారు ఇది కేవలం ఉద్యోగుల సమస్య మాత్రమే కాదని, రైతులకు మరింత మెరుగైన, స్థిరమైన సేవలు అందించేందుకు కూడా ఇది దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున ఈ న్యాయమైన డిమాండ్‌కు పూర్తి మద్దతు తెలుపుతున్నామని చెప్పారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి



- మోడల్ స్కూల్స్ టీచర్స్ అసోసియేషన్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఆర్థిక, ఆర్థికేతర సమస్యలపై ఉపముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ స్పందించాలని మోడల్ స్కూల్స్ ప్రోగ్రెసివ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ షఫీ కోరారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో వారు తమ ఆవేదన వ్యక్తం చేశారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు జరిగిన వివిధ రాజకీయ సభల్లో పవన్ కళ్యాణ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై పలుమార్లు స్పందించారని పేర్కొన్నారు. తాను ఉద్యోగస్తుడి కుమారుడినని, వారి సమస్యలపై స్పష్టమైన అవగాహన ఉందని చెప్పి, ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సీపీఎస్ రద్దు, పెండింగ్ డీఏ బకాయిల విడుదల, పీఆర్సీ కమిషన్ ఏర్పాటు, మెరుగైన ఐఆర్ ప్రకటిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు.

అయితే ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఈ హామీలపై ఎలాంటి చర్యలు కనిపించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఇంకా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి మౌనం వీడి, వెంటనే మెరుగైన ఐఆర్ ప్రకటించడంతో పాటు పీఆర్సీ కమిషన్ ఏర్పాటు అంశాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి ఉద్యోగులు, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు.

# పెరుగుతున్న వృద్ధులు.. తరుగుతున్న యువశక్తి

- ఏపీకి అదే పెద్ద సమస్యగా
- రెండింతలు కానున్న వృద్ధులు
- జనాభా స్థిరీకరణకు నిర్ణయం
- రాష్ట్రంలో జనాభా పై ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రభుత్వం



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** కూటమి అలెర్ట్ ఏపీకి అదే పెద్ద జబ్బు అని కూటమి ప్రభుత్వం గుర్తించింది. ఇప్పటి నుంచే దానికి తగిన మందు వేయకపోతే మాత్రం ఇది పెరిగి పెద్దదై ఏపీలో సంతాన సౌభాగ్యాన్ని చిదిమి వేస్తుందని ఆందోళన చెందుతోంది.

ఏపీకి అదే పెద్ద జబ్బు అని కూటమి ప్రభుత్వం గుర్తించింది. ఇప్పటి నుంచే దానికి తగిన మందు వేయకపోతే మాత్రం ఇది పెరిగి పెద్దదై ఏపీలో సంతాన సౌభాగ్యాన్ని చిదిమి వేస్తుందని ఆందోళన చెందుతోంది. ఏపీలో చూస్తే సంతానోత్పత్తి క్షీణత అధికంగా ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. తగిన చర్యలతో ముందుకు రాకపోతె కనుక అదే విధంగా కీలక చర్యలు తీసుకోకుంటే మాత్రం తీవ్రమైన అనర్థాలను ఏపీ చూడాల్సి ఉంటుందని వైద్య ఆరోగ్య రంగ నిపుణులు చెబుతున్నారు.

**జనాభా స్థిరీకరణ కోసం భారీ యాక్షన్ ప్లాన్ :** ఏపీలో అర్జంటుగా జనాభా స్థిరీకరణ కోసం భారీ యాక్షన్ ప్లాన్ ని కూటమి ప్రభుత్వం చేపడుతోంది. ఈ మేరకు కొత్త విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించింది. దీనిని మీద విస్తృత చర్చ కోసం ప్రజల ముందుకు జనాభా స్థిరీకరణ విధాన పత్రాన్ని తీసుకుని రాబోతోంది. ఏపీలో దారుణంగా సంతానోత్పత్తి రేటు ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం చూస్తే రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు కేవలం 1.50గా ఉందని గణాంకాలు చెబుతున్నాయి. ఇది 2035 నాటికి 2.10రేటుగా ఉంటనే జనాభా స్థిరీకరణ లక్ష్యం నెరవేరుతుందని ప్రభుత్వం భావిస్తోంది

**రెట్టింపు అవుతున్న వృద్ధులు :** ఏపీలో రానున్న కాలంలో రెండింతలు కానున్న వృద్ధుల సంఖ్య అని నివేదికలు చెబుతున్నాయి. అంతే కాదు సంతాన హీనతతో భారీగా ప్రగతి తగ్గనుంది అలాగే అవసరమైన శ్రామిక శక్తి కొరత ఏర్పడబోతోంది. దాంతో అనుకూల పరిస్థితుల కల్పనతో స్వచ్ఛందంగా అధిక మంది పిల్లలు కనే దిశగా బాటలు వేయాలని కూటమి ప్రభుత్వం చూస్తోంది. ఈ విధంగా ఏపీలో జనాభా పెరుగుదల కోసం ప్రభుత్వం రూపొందించిన నూతన విధానం గురించి ప్రభుత్వాధినేతలు ఇటీవల వివరించారు.

**క్షీణిస్తున్న సంతానోత్పత్తి రేటు :** ఆందోళనకర రీతిలో రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు క్షీణిస్తోందని ప్రభుత్వం ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఈ మేరకు మంత్రి విడుదల చేసిన ఒక వివరణాత్మక ప్రకటనలో రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు అంటే తన జీవితకాలంలో మహిళలు జన్మనిచ్చే పిల్లల సంఖ్య క్రమేణా అతి తక్కువగా 1.50కు పడిపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా స్థిరీకరణకు సంతానోత్పత్తి రేటు 2.10 అవసరం కాగా దశాబ్దాలుగా అనుసరిస్తున్న జనాభా నియంత్రణ విధానంతో ఈ రేటు ఈనాటికి 1.50 శాతానికి పడిపోయిందని చెప్పుకొచ్చారు. ఇకనైనా దిద్దుబాటు చర్యల్ని చేపట్టకుంటే ప్రజలతో పాటు రాష్ట్ర ఆర్థిక ప్రగతికి తీవ్ర విఘాతం ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నారు.

**ఏడాది కేడాది తగ్గుతున్న యువత :** ప్రజల తీరు మారకుంటే అధిక యువశక్తితో కూడిన జనాభాతో లభించే ప్రయోజనం 2040 నాటికి కనుమరుగవుతుందని చెప్పారు అంతే కాకుండా అధిక శాతం వృద్ధులతో కూడిన జనాభా రాష్ట్రానికి భారంగా మారనుందని మంత్రి స్పష్టం చేశారు. సంతానోత్పత్తి క్షీణతతో ప్రగతికి ఊతమిచ్చే కార్మిక శక్తి తగ్గిపోయి భారీగా పెరగనున్న వయో వృద్ధుల భారాన్ని రాష్ట్రం మోయాల్సి ఉంటుందని మంత్రి హెచ్చరించారు. ఈ నేపథ్యంలో 2035 నాటికి రాష్ట్రంలో జనాభా స్థిరీకరణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఒక నూతన ప్రణాళికను రూపొందించిందని ప్రభుత్వం చెబుతోంది.

**ఇద్దరి పిల్లలకు ఎక్కువమంది ఉండాలి :** జనాభా నియంత్రణ విధానానికి స్వస్తి పలికి జనాభా సంరక్షణతో కూడిన సానుకూల వాతావరణంలో ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లల్ని కనేలా కుటుంబాలు స్వచ్ఛంద నిర్ణయాలు తీసుకునే అనుకూల పరిస్థితుల్ని కల్పించడం నూతన విధానంగా వుంది. తల్లికి పూర్తి ఆరోగ్య భద్రత కల్పించి ఆరోగ్యకరమైన శిశువులకు జన్మనివ్వడం, వారి పోషణకు ప్రభుత్వం భరోసా ఇస్తుందని అన్నారు. ఇప్పటి వరకు అమలు చేసిన జనాభా నియంత్రణ విధానంతో రాష్ట్రంలో జనాభా వృద్ధిరేటు 2011-15కాలంలో ఉన్న 7.10శాతం నుండి నేటికి 1.70 శాతానికి తగ్గిందని, ఇదే మార్గంలో 2035 నాటికి మరింతగా తగ్గి 0.30 శాతానికి పడిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**మధ్యస్థ వయసు జనం పెరుగుతున్న వైనం :** ఇపుడున్న పరిస్థితులు కొనసాగితే రాష్ట్ర జనాభా వార్ధక్యం వైపు వేగంగా పయనించడం ఖాయమని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుత రాష్ట్ర జనాభా మధ్యస్త వయసు 32.50 సంవత్సరాలుండగా జాతీయ స్థాయిలో చూస్తే ఇది నాలుగున్నరేళ్ల తక్కువగా కేవలం 28 సంవత్సరాలు మాత్రమే ఉందని గుర్తు చేశారు. దీన్ని అడ్డుకోవాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు రానున్న 10 సంవత్సరాలు అత్యంత కీలకమని స్పష్టం చేశారు. 2035 నాటికి 2.10 సంతానోత్పత్తి రేటును సాధించి జనాభా స్థిరీకరణకు బాటలు వేయాల్సిన అవసరముందని చెబుతున్నారు. ఈ దిశగా ప్రజా ఉద్యమాన్ని నిర్మించడానికి సహకరించాలని ప్రభుత్వం కోరుతోంది. . మరి ఈ విధాన పత్రం మీద ప్రజాభిప్రాయం ఏ విధంగా ఉంటుందో చూడాల్సి ఉంది

# రాయలసీమకు దగా చేసింది జగనే

(మొదటి పేజీ తరువాయి)

బట్టకాల్చి మీద వేసే బుద్ధి ఉన్న మీరు మారరు అని విమర్శించారు. తెలంగాణా సభలో అప్పటి మంత్రి హరీష్‌రావు రాయలసీమ ప్రాజెక్ట్‌ను ఆపింది మేమే అని చెప్పలేదా అని నిలదీశారు. గతంలో వైఎస్సార్ సీఎం గా ఉన్న సమయంలో మిగులు జలాల్లో వాటా అడగము అని రాసి ఇవ్వలేదా అని నిలదీశారు. మాజీ సియం జగన్ హయాంలో చీఫ్ సెక్రటరీ, ఈఎన్సీ రాయలసీమ ప్రాజెక్ట్ పై ఏమని వ్రాసారో తెలుసా.. రాయలసీమ ప్రాజెక్ట్ అసలు ఇరిగేషన్ ప్రాజెక్ట్ కాదు మేము కేవలం స్టడీ చేస్తున్నామని రాయలేదా.. ఆ అఫిడివిట్లు చూపమంటారా.. ప్రజలను మళ్లీ మోసం చేయడానికి మీరు ఎప్పుడూ రాజకీయం కోసం రాయలసీమను వాడుకునే విధంగా మరోసారి రాజకీయం చేస్తున్నారన్నారు. ఎన్టీయార్ హయాంలో గాలేరు నగరి, హంద్రీనీవా, తెలుగుగంగ ఈ మూడు ప్రాజెక్ట్ లు ప్రారంభమయ్యాయని మంత్రి అన్నారు. నేడు రాయలసీమ సస్యశ్యామలానికి ఈ మూడు ప్రాజెక్ట్ లు కారణం కాదా అని అన్నారు. కాని మీరు ఇన్ని సంవత్సరాల్లో రాయలసీమకు చుక్కనీరందించారా అని ప్రశ్నించారు. జగన్ మోహన్ రెడ్డి ఈ మూడు ప్రాజెక్ట్ లకు ఏం చేశారు.. రాయలసీమ అభివృద్ధికి ఎంత ఖర్చు పెట్టారో చర్చకు రావాలని సవాల్ విసిరారు. అదే మా పాలనలో ఒక్కసంవత్సరంలోనే హంద్రీనీవా ప్రాజెక్ట్ కు రూ. 3,700 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఒకే సంవత్సరంలో కేటాయింపులు,



ఆదే సంవత్సరంలో పనులు ప్రారంభించి పూర్తి చేయడం జరిగిందని ఇది చరిత్రలో ఒక రికార్డు అని అన్నారు. అంతే కాకుండా మరో రూ. 2వేల కోట్లు ఖర్చు చేయనున్నామని తెలిపారు. మీ హయాంలో ఐదేళ్లలో మీరు రాయలసీమ పేరు పలకడానికి కూడా సాహసించలేదని, కాని మేము రూ. 40వేల కోట్లతో రాయలసీమ హార్టీకల్చర్ హబ్ పెడతామని, రాయలసీమను అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. రాయలసీమ పై మీ మొసలి కన్నీరు కార్చితే నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరన్నారు.

రాయలసీమ ప్రాజెక్ట్ కంటే తక్కువ ఎత్తులో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం మేము పూర్తి చేశాము కదా.. మళ్లీ రాయలసీమ ప్రాజెక్ట్ ఎందుకన్నారు. ఎటువంటి అభ్యంతరాలు లేకుండా ముచ్చుమర్రి పథకం పనిచేస్తుంది.. అన్ని అనుమతులు తెచ్చాము కదా అని మంత్రి వివరించారు. కేవలం వివాదం, ప్రాంతాల మధ్య విద్వేషాలు సృష్టించడానికి ఇటువంటి చర్యలకు దిగుతున్నారని విమర్శించారు. మీ పాలనలో రాయలసీమ ప్రాజెక్ట్ పై స్టే విధిస్తే మీరు ఏం చేశారని కనీసం ఒక్క ప్రయత్నం కూడా చేయలేదు అని విమర్శించారు. ప్రక్క రాష్ట్రంలోని తుంగభద్ర డ్యాం గేట్లు కొట్టుకుపోతే తక్షణం స్పందించామని, గేట్లు పెట్టడానికి కుదరదు అన్న పరిస్థితి నుండి దేశంలోనే నిపుణులను తీసుకువచ్చి పంట నష్టపోకుండా చర్యలు తీసుకోగలిగామన్నారు. ఇప్పటికే 33 గేట్లలో 18 గేట్లు మూడు నెలల్లోనే బిగించడం జరిగిందని,వర్షాలు వచ్చే లోపు మిగిలిన గేట్లు కూడా బిగిస్తామన్నారు. రాయలసీమకు మీరు దగా చేశారని, రాయలసీమను వాడుకుని వదిలివేసింది ఒక్కజగన్ మాత్రమే అని అన్నారు. ఉరవకొండ జలదీక్ష సమయంలో మూడు నెలల్లో హంద్రీనీవా పూర్తి చేస్తామని హామి ఇవ్వాలేదా మరి ఐదేళ్ల కాలంలో ఒక్కరూపాయి ఖర్చు చేయలేదని ఎద్దేవ చేశారు. మీ కడుపు మంటను రైతుల కన్నీళ్లుగా మార్చవద్దని మంత్రి హితవు పలికారు.

## గుంటూరు నగరంలో రోడ్లపై వాటర్ చల్లెలా చర్యలు



- రోడ్లపై దుమ్ము ధూళి లేవకుండా చర్యలు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని, ప్రజలకు , వాహనదారులకు వేసవి తాపం నుండి ఉపశమనం కలిగించేందుకు, గాలుల వలన రోడ్లపై దుమ్ము, ధూళి ఎగిసి పడకుండా వాటర్ స్ప్రింక్లర్ల ద్వారా నీటిని చిమ్ముతూ గుంటూరు నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు చేపట్టిందని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఎండల తీవ్రత గరిష్టంగా ఉండే ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నగరంలోని ప్రధాన రహదారులు, రద్దీగా ఉండే కూడళ్లు , ట్రాఫిక్ జంక్షన్లలో వాటర్ స్ప్రింక్లర్ల ద్వారా నీటిని రెండు వాహనాల ద్వారా పిచికారీ చేయిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల కేవలం వాతావరణం చల్లబడడమే కాకుండా, గాలిలో ఉండే దుమ్ము, ధూళి కణాలు అదుపులోకి వచ్చి గాలి నాణ్యత మెరుగుపడుతుందన్నారు. ముఖ్యంగా నిర్మాణ పనులు జరిగే ప్రాంతాల్లో మరియు వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే చోట్ల ఈ స్ప్రింక్లర్ల వినియోగం వల్ల కాలుష్యం తగ్గుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే జనసమ్మర్దంగా ఉండే ముఖ్యమైన సెంటర్లలో చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నగర ప్రజలు ఈ వేసవి కాలంలో వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళల్లో బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు.

## గుంటూరులో 17న ప్రపంచ హీమోఫిలియా దినోత్సవం

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ప్రపంచ హీమోఫిలియా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరులో ఏప్రిల్ 17, న విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాన్ని హీమోఫిలియా సొసైటీ విజయవాడ చాప్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంగా హీమోఫిలియా బాధితులకు మద్దతు తెలియజేస్తూ, సమాజంలో అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఈ సంవత్సరానికి "నిర్ధారణ: సంరక్షణకు మొదటి అడుగు" అనే థీమ్ను ప్రకటించారు. సరైన సమయంలో రోగ నిర్ధారణ జరగడం ద్వారా మాత్రమే సమర్థవంతమైన చికిత్స , సంరక్షణ అందించగలమని వైద్య నిపుణులు పేర్కొన్నారు.

ప్రపంచ హీమోఫిలియా సమాఖ్య అంచనా ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా హీమోఫిలియా బాధితులలో ముప్పావు వంతు కంటే ఎక్కువ మందికి ఇప్పటికీ వ్యాధి నిర్ధారణ జరగలేదని వెల్లడైంది. ఇతర రక్తస్రావ రుగ్మతల విషయంలో ఈ అంతరం ఇంకా ఎక్కువగా ఉందని తెలిపారు. దీని వలన అనేక మంది రోగులు ప్రాథమిక చికిత్సను పొందలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ సమస్యలను అధిగమించడానికి ఆరోగ్య సంరక్షణ నిపుణుల నైపుణ్యాలను పెంపొందించడం, ప్రయోగశాలల సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలను విస్తరించడం అత్యంత అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. రోగ నిర్ధారణ రేటును పెంచడం ద్వారా "అందరికీ చికిత్స" అనే లక్ష్యాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు.

ప్రతి సంవత్సరం ఏప్రిల్ 17న ప్రపంచ హీమోఫిలియా దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ప్రపంచ హీమోఫిలియా సమాఖ్య స్థాపకుడు ఫ్రాంక్ ష్నాబెల్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. హీమోఫిలియా , ఇతర రక్తస్రావ రుగ్మతలపై అవగాహన పెంచడం, రోగులకు సరైన చికిత్స అందించేందుకు ప్రభుత్వాల దృష్టిని ఆకర్షించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యంగా వుంది. ఈ సందర్భంగా నగరంలో వాకథాన్, అవగాహన ర్యాలీలు, వైద్య శిబిరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. హీమోఫిలియా బాధితులు ,వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు.

## గంట దాటాకే చెల్లింపులు.. కిల్ స్విచ్.. ఆర్‌బీఐ 5 ప్రతిపాదనలు!



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** దేశంలో డిజిటల్ లావాదేవీలు గణనీయంగా పెరిగాయి. అదే సమయంలో డిజిటల్ మోసాలూ అదే స్థాయిలో పెరిగాయి. వీటిని అరికట్టేందుకు ఆర్‌బీఐ కొన్ని కొత్త ప్రతిపాదనలతో ముందుకొచ్చింది. గంట దాటాకే చెల్లింపులు, కిల్ స్విచ్ వంటి కొత్త ప్రతిపాదనలు తీసుకొచ్చింది. ఈ మేరకు తాజాగా ఓ చర్చా పత్రాన్ని విడుదల చేసింది. దీనిపై అభిప్రాయాలు సేకరించాక అమల్లోకి తీసుకురానుంది. కొత్తగా ఎవరికైనా రూ. 10 వేలకు మించి చెల్లింపులు చేయాల్సి వస్తే ఆ సొమ్ము అవతలి వారికి చేరడానికి గంట సమయం పడుతుంది. ఈలోపు కస్టమర్‌కు ఏదైనా అనుమానం వస్తే ఆ లావాదేవీని రద్దు చేసుకోవచ్చు. తన ఖాతాలో ఏదైనా అనుమానాస్పద, అనధికారిక లావాదేవీ జరిగిందని ఖాతాదారుడు భావిస్తే వెంటనే అన్ని రకాల డిజిటల్ చెల్లింపులను ఒక్కక్లిక్‌తో నిలిపివేసేలా కొత్తగా 'కిల్ స్విచ్'ను ఆప్షన్‌ను ఆర్‌బీఐ ప్రతిపాదించింది. దీంతో యూపీఐ, ఆన్‌లైన్ బ్యాంకింగ్, కార్డు లావాదేవీలన్నీ నిలిచిపోతాయి. 70 ఏళ్లు పైబడిన వారు లేదా దివ్యాంగులు రూ. 50వేలు పైబడిన లావాదేవీలు చేసేటప్పుడు వారు ముందుగా నామినేట్ చేసిన వ్యక్తి ఆమోదం తెలపాల్సి ఉంటుంది. వారు ఆమోదిస్తేనే అవతలి వారికి ఫండ్స్ క్రెడిట్ అవుతాయి. సైబర్ నేరగాళ్లు తమ ఆచూకీ పోలీసులకు చిక్కకుండా మ్యూల్ ఖాతాలను (వేరే వాళ్ల ఖాతాలు) వినియోగిస్తుంటారు. వాటికి చెక్ పెట్టి మోసపూరిత ఖాతాలను గుర్తించేందుకు, సరైన ధ్రువీకరణ లేని ఖాతాల్లో వార్షిక క్రెడిట్ పరిమితిని రూ. 25 లక్షలకు పరిమితం చేయాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది.

**కొత్త ఖాతాలకు పరిమిత ఫీచర్లు:** కొత్తగా తెరిచిన బ్యాంకు ఖాతాలకు యూపీఐ, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి ఫీచర్లను డిఫాల్ట్‌గా నిలిపివేయాలని ఆర్‌బీఐ సూచించింది. తొలి దశలో కొన్ని ఫీచర్లు మాత్రమే అందించాలని పేర్కొంది. తద్వారా మోసపూరిత కార్యకలాపాలు తగ్గుముఖం పడతాయని ఆర్‌బీఐ అభిప్రాయపడింది.

## అభివృద్ధి పనుల సమగ్ర ప్రణాళికలను సమర్పించాలి

- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ముఖ్యమంత్రి జిల్లా సమీక్ష సమావేశానికి సంబంధించి జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నిర్దిష్టమైన అంశాలతో సమగ్ర ప్రణాళికలను సమర్పించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సి.ఎం సాయికాంత్ వర్మ ముఖ్యమంత్రి వర్యుల జిల్లా సమీక్ష సమావేశానికి సంబంధించి నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా చేపాట్టాల్సిన అభివృద్ధి పనులు , శాఖల వారీగా వివరాల పూర్తి నివేదిక అందించాలన్నారు. ప్రతిపాదించిన పనుల వాస్తవ వివరాలు, పకడ్బందీగా నివేదికలను స్వయంగా జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రూపొందించాలన్నారు. తాడికొండ నియోజకవర్గం పరిధిలో కొండవీటి వాగు పై నిర్మించనున్న హైలెవల్ బ్రిడ్జి, అభివృద్ధి పనులు పూర్తి స్థాయిలో ప్రతిపాదనలు సీఆర్డీఏ అధికారుల సమన్వయంతో రూపొందించాలన్నారు. ప్రతిపాదిస్తున్న పనులకు పూర్తి జస్టిఫికేషన్ వివరాలు, మ్యాప్ లు, ఫోటోలతో ప్రజెంటేషన్ సిద్ధం చేయాలన్నారు. నియోజకవర్గాల వారీగా ప్రజెంటేషన్ వివరాలు శుక్రవారం సాయంత్రం నాటికి అందించాలన్నారు.

జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ జిల్లా పరిధిలో గుంటూరు ఛానల్, గుంటూరు నల్ల, ఇతర పంట కాలువల అభివృద్ధి పనుల ప్రతిపాదనలను సాగుభూముల ఆయకట్టు తదితర పూర్తి వివరాలతో రూపోందించాలన్నారు.

ఈ సమావేశంలో ఇన్చార్జి డీఆర్వో ఏ గంగరాజు, తెనాలి ఇన్చార్జి సబ్ కలెక్టర్, జిల్లా విపత్తుల నిర్వహణ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీ కుమారి, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటరత్నం, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి. జ్యోతి బసు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి. వి. రంగారావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె. కళ్యాణ చక్రవర్తి,, జిల్లా పంచాయతీ అధికారి బి. వి. నాగ సాయి కుమార్, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె. వి. వి సత్యనారాయణ,, డి. ఆర్. డి. ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి. విజయ లక్ష్మి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు. చెన్నయ్య, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి కె. మయూరి, ముఖ్య ప్రణాళిక అధికారి పి. శేష శ్రీ, , ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజనీర్ శ్రీనివాస మూర్తి, , కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎ. గాయత్రి దేవి, , జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి జి. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## దామోదర్ రెడ్డి కాంస్య విగ్రహావిష్కరణకు హాజరైన వొడితల ప్రణవ్..

- దామోదర్ రెడ్డి సేవలు చిరస్మరణీయం.
- హుజూరాబాద్ నియోజకవర్గంలో దామోదర్ రెడ్డి విగ్రహన్ని ఏర్పాటు చేస్తాం.
- అనేక మంది కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దిన గొప్ప వ్యక్తిత్వం కలిగిన నాయకుడు.
- హుజూరాబాద్,పాత కమలాపూర్ నుండి భారీగా తరలివచ్చిన అభిమానులు.
- జోహార్ దామన్న నినాదాలతో మారుమ్రోగిన సభా ప్రాంగణం.



రాజకీయాల్లో ప్రజల అవసరాల కోసం పనిచేసి కరీంనగర్ జిల్లా టైగర్ గా,నమ్మకానికి,విశ్వసనీయతకు మారు పేరు తెచ్చుకున్న మహా నాయకుడు ముద్దసాని దామోదర్ రెడ్డి అని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.గురువారం రోజున కరీంనగర్ పట్టణ శివారులోని సదాశివపల్లిలో పెద్దపల్లి ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ విజయ రమణారావు ఆధ్వర్యంలో ఆయన 14వ వర్ధంతి సందర్భంగా కాంస్య విగ్రహన్ని ఆవిష్కరించారు.అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ ముద్దసాని దామోదర్ రెడ్డి గురించి జిల్లాలో తెలియని వ్యక్తి లేడంటే అతిశయోక్తి కాదని,వ్యక్తిగతంగా మా కుటుంబానికి,మా తాత వొడితల రాజేశ్వర్ రావు కు చాలా దగ్గరి వ్యక్తి అని,వారి నుండి మాలాంటి యువతర నాయకులం నేర్చుకోవాల్సింది చాలా ఉందని,వారి ఆశయాలకు అణుగుణంగా ప్రజా జీవితంలో పనిచేస్తామని,హుజూరాబాద్ నియోజకవర్గంలో దామోదర్ రెడ్డి విగ్రహన్నీ ఏర్పాటు చేస్తామని ప్రణవ్ తెలిపారు.విగ్రహ ఆవిష్కరణ అనంతరం ఏర్పాటు చేసిన సభలో పెద్దపల్లి శాసన సభ్యుడు విజయ రమణారావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోనే కాదు రాష్ట్ర స్థాయిలో దామోదర్ రెడ్డికి అభిమానులు ఉండేవారని,వారి తర్వాత ఆ ప్రాంతానికి నాయకత్వం వహించే నాయకుడిగా వచ్చే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ,కరీంనగర్ శాసన సభ్యులు గంగుల కమలాకర్,కరీంనగర్ మేయర్ శ్రీనివాస్,సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సత్తు మల్లేష్,దామోదర్ రెడ్డి అభిమానులు భారీగా పాల్గొన్నారు.

## జిల్లెల్లలో ప్రవేట్ పాఠశాలలో దారుణం

## విద్యార్థినిని విచక్షణారహితంగా కొట్టిన ఉపాధ్యాయురాలు



**తంగళ్లపల్లి, ఏప్రిల్ 10 (జర్నలిస్ట్ ఫైల్) :**

రాజన్న సిరిసిల్ల జిల్లా, తంగళ్ళపల్లి మండలం జిల్లెల గ్రామంలోని క్రాసింగ్ లో ఉన్న విజ్ఞాన్ విద్యానికేతన్ పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్న సోఫియా అనే విద్యార్థిని ఇష్టం వచ్చినట్లు చితకబాదిన ఉపాధ్యాయురాలు..విద్యార్థి శరీరంపై దద్దులు వచ్చేలా కట్టెతో విచక్షణారహితంగా కొట్టిన ఉపాధ్యాయురాలు.హోంవర్క్ నీటుగా చేయలేదు అనే కారణంతో విద్యార్థి సోఫియా పై దాడి పాఠశాలల్లో ఉపాధ్యాయుల చేతిలో విద్యార్థులు ముఖ్యంగా బాలికలు శారీరక దాడులకు అక్కడక్కడ గురవుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్న ఉపాధ్యాయులు తీరు మార్చుకోకపోగా మళ్లీ,మళ్లీ దాడి ఘటనలు పునరావృతం అవ్వడం చాలా బాధాకరం కాగా ఈ పాఠశాల నిర్వాహకులు ఫీజుల విషయంలో కూడా విద్యార్థులను ఇబ్బంది పెడుతూ బయట ఎండలో నిలబెడుతున్నారనే ఆరోపణలు తల్లిదండ్రుల నుండి వెలువెత్తుతున్నాయి.ఈ ఘటనపై విద్యాశాఖ అధికారులు విచారణ చేసి పాఠశాల యాజమాన్యం,ఉపాధ్యాయురాలి పై చర్యలు తీసుకోవాలని స్థానికులు,విద్యార్థి తల్లిదండ్రులు కోరుతున్నారు.

## ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు....

### జి టి ఆర్ ఎం జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు.



**శిరివెళ్ల: ఏప్రిల్ 10 (జర్నలిస్ట్ ఫైల్) :**

మండల పరిధిలోని గంగుల తిమ్మారెడ్డి ప్రభుత్వం జూని యర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక కళాశాలలో 2026-27 విద్య సంవత్సరానికి గాను పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థు లు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు కోరారు .


## కేటీఆర్ పర్యటనలో వార్డు సభ్యులను పరిచయం చేసిన జీవన్ రెడ్డి



**రాయికల్ ఏప్రిల్ 10 (జర్నలిస్ట్ ఫైల్) :**

జగిత్యాల పట్టణంలోని మాజీ మంత్రి జీవన్ రెడ్డి నివాసానికి వచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో స్థానిక వార్డు సభ్యులను జీవన్ రెడ్డి ప్రత్యేకంగా పరిచయం చేశారు. జీవన్ రెడ్డి టీఆర్ఎస్ పార్టీలో చేరిక అంశంపై చర్చించేందుకు కేటీఆర్ ఆయన నివాసానికి చేరుకుని మాట్లాడేందుకు ఇంటి మెట్లపైకి వెళ్తున్న సమయంలో, అక్కడ ఉన్న రాయికల్ మండలం మైతాపూర్ గ్రామ వార్డు సభ్యులు అనుమల్ల రమ సత్యనారాయణ, బూస గంగ మల్లయ్యలను కేటీఆర్‌కు పరిచయం చేశారు.ఈ సందర్భంగా ఎంతో మంది కార్యకర్తలతో బిజీగా ఉన్నప్పటికీ తమను కేటీఆర్‌కు పరిచయం చేయడం పట్ల వార్డు సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. జీవన్ రెడ్డి చూపిన ఆత్మీయతకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం..



**పెద్దపల్లి, ఏప్రిల్ 10 (జర్నలిస్ట్ ఫైల్) :**

గురువారం పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ రక్తనిధి కేంద్రంలో రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ శిబిరంలో సామాజిక సేవకుడు పాంపాటి శ్రీకాంత్ పాల్గొని రక్తదానానికి ప్రజలను ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్‌కు చెందిన బోడకుంట రామకృష్ణ, సాయిలు మరియు రెడ్ క్రాస్ సొసైటీకి చెందిన కావేటి రాజగోపాల్,బత్తిని అనిల్ కుమార్, రాజకుమార్, శ్రవణ్, సాయి, సాయి రాకేష్, మహేష్, లక్ష్మణ్, తాజ్ బేగ్, గుండా సాయి వర్మ, శ్రీనివాస్, మహేష్, వెంకటేశ్వర రావు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని, యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

# పాఠశాల స్థలం కబ్జా కు యత్నం

### బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

### మెదక్ ఎంపీ రఘునందన్ డిమాండ్



**జర్నలిస్ట్‌ఫైల్** పటాన్చెరు పట్టణం నడిబొడ్డున వున్న జిల్లా పరిషత్ హై స్కూల్ స్థలం కబ్జాచేసేందుకు యత్నిస్తున్నారని,ఇందులో భాగంగానే పాఠశాల భవనాన్ని రాత్రికి రాత్రి కూల్చి వేశారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు.ఈ విషయంలో కలెక్టర్ తీరుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు.గురువారం పటాన్చెరు శ్రీనగర్ కాలనీలో రాత్రి కూల్చి వేసిన పాఠశాల భవనాన్ని బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఫోన్ చేసి కలెక్టర్ కు,డీసీపీ కి ఫిర్యాదు చేసేవరకు కూల్చివేతలు కొనసాగాయని తెలిపారు.జాతీయ రహదారి విస్తరణకు పాఠశాల అడ్డుగా లేకున్నా ఎందుకు కూల్చివేశారు,ఎవరు కూల్చారు,ఎవరి ఆదేశాలతో కూల్చారో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాఠశాల ప్రహరికి ముందు ఉన్న దుకాణాలు తొలగించకుండా ప్రహరీ నుంచి పది అడుగుల దూరంలో ఉన్న భవనాన్ని రాత్రికి రాత్రి ఎందుకు కూలచాల్సి వచ్చిందని ప్రశ్నించారు.

1962 కు పూర్వం నుంచే అక్కడ పాఠశాల ఉందని,భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన ప్రొసీడింగ్స్ చూపిస్తూ,సర్వే రిపోర్ట్ లను సైతం ఆయన ప్రదర్శించారు.స్థానికంగా ఉన్న కొందరు ఆ భూమి పై వివాదం సృష్టించి కింది కోర్టు నుంచి సుప్రీం కోర్ట్ వరకు అన్నికోర్టుల్లోనూ ఓడిపోయారని గుర్తు చేశారు.పాఠశాల స్థలాన్ని కాపాడాల్సిన అధికారులు కబ్జాదారులకు అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. ఈ విషయంలో జిల్లాకలెక్టర్ స్పందన పట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు.వెంటనే అధికారులను పంపి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి ఉదాసీనంగా వ్యవహరించారని ఆరోపించారు.ఇప్పటికైనా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో స్థానికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.జాతీయ రహదారి విస్తరణకు,పాఠశాల కూల్చి వేతకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.మరియు కబ్జాకు గురవుతున్న పాఠశాల స్థలాన్ని మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు జిన్నారం మున్సిపల్ చైర్మన్ ప్రతాపరెడ్డి.అమ్దూరి మాజీ సర్పంచ్ నర్సింగరావు.అమీన్పూర్ బిజెపి మండల అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్. శ్రీనివాస్ గుప్తా.బైండ్ల కుమార్.శంషాబాద్ రాజు ముదిరాజ్. కొండా లక్ష్మణ్.సుజాత. బాల్రాజ్.పాత్రికేయ మిత్రులతో కలిసి కూల్చివేసిన పాఠశాల స్థలాన్ని పరిశీలించడం జరిగింది ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ములకలపల్లి మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే జారె





### పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన ఎమ్మెల్యే

### అశ్వారావుపేట నియోజకవర్గ అభివృధే ధ్యేయం

**ములకలపల్లి, ఏప్రిల్ 10 (జర్నలిస్ట్ ఫైల్) :**

అశ్వారావుపేట నియోజకవర్గం ములకలపల్లి మండలంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గారు విస్తృతంగా పర్యటిస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. రామచంద్రాపురం, చాపరాలపల్లి గ్రామాల్లో ప్రభుత్వ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులకు మద్దతు తెలిపారు.అనంతరం పేదలకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ వేడుకల్లో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.

కుమ్మరిపాడు గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం గుట్టగూడెం గ్రామంలో పూర్తయిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం నిర్వహించారు.అలాగే డ్వాక్రా మహిళల కోసం సమావేశ మందిరం (వీవో బిల్డింగ్) నిర్మాణపనులకు శంకుస్థాపన చేశారు.

మాదారం గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు.మండల కేంద్రంలోని రైతువేదికలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.చివరగా ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి మండల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలియజేశారు.పర్యటనలో భాగంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న పలువురిని పరామర్శించారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు, మండల అధికారులు, ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి పై దాడి.. పత్రికా స్వేచ్ఛ పై దాడే..

### ఏపీయూడబ్ల్యూజే, నంద్యాల జిల్లా కమిటీ ఖండన

**నంద్యాల ప్రతినిధి ఏప్రిల్ 10 (జర్నలిస్ట్ ఫైల్) :**

వీకెండ్ కామెంట్ బై ఆర్కే లో మహిళలను కించపరిచారని ఆరోపిస్తూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్రజ్యోతి ఎడిషన్, లోకల్ కార్యాలయాలపై దాడులకు ప్రయత్నించడం చూస్తే పత్రికా స్వేచ్ఛపై దాడి చేయడమే అని ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఖండే శ్యాం సుందర్ లాల్, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చీకటి చలంబాబు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మధుబాబు, ఉస్మాన్ భాష, నంద్యాల పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రాజ్ కుమార్ రెడ్డి వైపై భాష లు. రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్రజ్యోతి ఎడిషన్ కార్యాలయాలపైన, లోకల్ కార్యాలయాలపైన వైసీపీ నేతలు దాడికి ప్రయత్నించడం పై వారు ఆందోళన వ్యక్తం చేశారు. వ్యతిరేక వార్తలు ప్రసారం చేశారని మొన్న హైదరాబాద్ లోకల్ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ప్రధాన కార్యాలయం పైన, నిన్న రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్రజ్యోతి ఎడిషన్, లోకల్ కార్యాలయాలపైన వైసీపీ నేతలు, కార్యకర్తలు




దాడికి ప్రయత్నించడం సబబు కాదన్నారు. ఏబీఎన్ లో వచ్చిన వార్త తమకు పూర్తిగా వ్యతిరేకం ఉందని భావిస్తే లీగల్ గా న్యాయస్థానాలను ఆశ్రయించి పరువునష్టం దావా వేయవచ్చన్నారు. అలా కాకుండా ఏకంగా కార్యాలయాల మీదకు దండెత్తడం అంటే పత్రికా స్వేచ మీద దాడి చేయడమే అన్నారు. ఈ ధోరణి ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమని చెప్పారు. ఒక మీడియా సంస్థను నడుపుతున్న ఆ పార్టీ అధినేతకు ఇది తెలియదనుకోవడం పొరపాటే అవుతుందన్నారు. ఎవరికివారు తమపై వ్యతిరేక వార్తలు వచ్చాయని మీడియా సంస్థలపైన, జర్నలిస్టుల పైన దాడులు చేసుకుంటూ పోతే రేపు ప్రజల నిజమైన సమస్యలను కూడా వెలుగులోకి తెచ్చే పరిస్థితి ఉండదన్నారు. ఇప్పటికే మీడియా స్వేచ్ఛ సూచీలో మన దేశం రోజు రోజుకు దిగజారుతోందని, ఇది దేశానికి, ప్రజాస్వామ్యానికి, ప్రజలకు అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. పోలీసులు కూడా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థలపై, జర్నలిస్టుల పైన దాడులు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## రాయలసీమ అభివృద్ధికి శాపంగా అమరావతి రాజధాని:అబ్దుల్లా బేగ్.

### గ్రేటర్ రాయలసీమ కోసం ఉద్యమం తప్పదు.

**వెలుగోడు ఏప్రిల్ 10 (జర్నలిస్ట్ ఫైల్) :**

రాయలసీమ అభివృద్ధికి, రాష్ట్ర రాజధాని అమరావతి శాపంగా మారిందని మాజీ ఎస్ డి పి ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్లా బేగ్ పేర్కొన్నారు. గురువారం ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ గత ఉమ్మడి రాష్ట్ర విభజన పీడకల మరువకముందే అమరావతిని రాష్ట్ర రాజధానిగా పాలకులు పార్లమెంట్ లో చట్టం తీసుకువచ్చి , రాయలసీమకు తీరని అన్యాయం చేశారని ఆయన మండిపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో హైదరాబాద్ రాజధానిగా పరిశ్రమలు, ఐటిహబ్ లు, భారీ ప్రభుత్వ కార్యాలయాలు, ఇంటర్నేషనల్ విమానాశ్రయాలు, పెద్ద పెద్ద పార్కులు, ఫార్మా కంపెనీలు, రైల్వే స్టేషన్లో, మెట్రోరైళ్లు, విశాలమైన సిమెంట్ రోడ్లు, స్టేడియంల నిర్మాణాలు లకు ఉమ్మడి రాష్ట్రంలోని ప్రజల ధనాన్ని వెచ్చించి హైదరాబాద్ను అభివృద్ధి పరిచిన, వాటన్నింటినీ త్యాగం చేసిన రోజులు మరిచిపోయి నేడు మరో ప్రాంతాన్ని రాష్ట్ర ప్రజల సంపదతోఅన్ని విధాలుగా అభివృద్ధికి



పూనుకోవడం తప్పన్నారు. రాయలసీమ అభివృద్ధిలో వెనుకబడుతున్న, రాయలసీమలోని ప్రజా ప్రతినిధులు ఏమో సాధించిన విధంగా సంబరాలు చేసుకోవడం హాస్యస్పదంగా ఉందన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్ణయంతో అన్ని ప్రాంతాల అభివృద్ధిపై 100% ప్రభావం చూపుతుంది అన్నారు. రాష్ట్ర రాజధాని పేరుతో ఆ ప్రాంతానికి అభివృద్ధికి భారీ నిధులు పెట్టుబడును వచ్చే అవకాశం ఉందన్నారు. ఒకే ప్రాంతంలో ఖర్చు చేసినప్పుడు రాయలసీమలో మౌలిక వసతులు ,పరిశ్రమలు ఏర్పాటుకు అంతరాయం కలుగుతుందన్నారు. రాయలసీమలో ప్రభుత్వ కార్యాలయాలు, ఉద్యోగ అవకాశాలు లేకుండా పోతాయన్నారు. రాయలసీమ యువత ఉపాధి కోసం వలసలు వెళ్లే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. రాష్ట్ర నిధుల వినియోగంలో అసమానతలు చోటుచేసుకునే అవకాశం ఉందన్నారు. నీటి వనరుల సమస్యలు తలెత్తుతాయన్నారు. అదేవిధంగా రాయలసీమ ప్రాంత ప్రజా ప్రతినిధుల పరపతి కూడా తగ్గుతుందన్నారు. ఏదిఏమైనాప్పటికీ రాష్ట్ర రాజధాని అమరావతి అయినప్పటికీ, రాయలసీమ అభివృద్ధి కోసం రాయలసీమ ప్రజాప్రతినిధులు రాయలసీమకు న్యాయం కలిగేలా రాష్ట్ర ప్రజల నిధులలో సమాన వాట తీసుకువచ్చి రాయలసీమ అభివృద్ధి చేయాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. లేకపోతే రాయలసీమలోని యువత గ్రేటర్ రాయలసీమ కోసం ఉద్యమాలు చేపట్టవలసి వస్తుందన్నారు.

## తనకల్లు లో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ మహా శిక్షణ అభియాన్2026కార్యక్రమం

**తనకల్లు ఏప్రిల్ 10 (జర్నలిస్ట్ ఫైల్) :**

తనకల్లు మండలంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ మహా శిక్షణ అభియాన్ 2026 కార్యక్రమం

గురువారం స్థానిక పీవీకే ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని మండల అధ్యక్షులు బాబు రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చింతా శరత్ కుమార్ రెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి, అలాగే జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబులేష్ పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా చింతా శరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా 18 కోట్లకు పైగా సభ్యత్వంతో నిలిచిందని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను కార్యకర్తలకు చేరవేసే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం శిక్షణ శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అందులో భాగంగానే ఈ శిక్షణ కార్యక్రమాన్ని తనకల్లు మండలంలో నిర్వహించినట్లు తెలిపారు.

అలాగే, దేశ సేవలో బీజేపీ 47 సంవత్సరాలుగా నిరంతరం పనిచేస్తుందని, నరేంద్ర మోదీ నాయకత్వంలో గత 11 సంవత్సరాలుగా పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. “సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్, సబ్కా ప్రయాస్” అనే లక్ష్యంతో పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు.

2019 నుంచి అంత్యోదయ పథకం ద్వారా పేద ప్రజలకు ఉచిత బియ్యం అందిస్తున్నారని, రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా సంవత్సరానికి రూ.6000 ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా రైతులకు ఎరువులను సబ్సిడీ ధరలకు అందిస్తున్నట్లు తెలిపారు.



ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, మండల అధ్యక్షుడు బాబు రెడ్డి,ప్రధాన కార్యదర్శి పసుపులేటి సురేంద్ర,జిల్లా నాయకులు లచ్చప్ప నరెష్, చలపతి, కార్యదర్శి జయశంకర్ రెడ్డి,ఓబీసీ మోక్ష మండల అధ్యక్షుడు గణేష్, జానకి,నర్సారెడ్డి,కిష్టయ్య,రసూలు, వెంకటేశుకార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మధిర ప్రాంత అభివృద్ధే లక్ష్యం

: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

- రూ. 18 కోట్ల 30 లక్షలకు పైగా నిధులతో గ్రామీణ రోడ్లకు శ్రీకారం
- మధిరలో నూతన ఇ.ఆర్.ఓ. కార్యాలయానికి శంకుస్థాపన
- మధిర ప్రాంతంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం



ఖమ్మం, మధిర, (జర్నలిస్ట్ ఫైల్) : మధిర ప్రాంత అభివృద్ధే లక్ష్యంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క గురువారం మధిర ప్రాంతంలో పలు అభివృద్ధి పనులకు తెలంగాణ నార్తన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి శంకుస్థాపన చేశారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ద్వారా సి.ఆర్.ఆర్. (2025-26) 7 కోట్ల 71 లక్షల రూపాయల నిధులతో చేపట్టిన అంబారుపేట మాటూరుపేట వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, 10 కోట్ల 60 లక్షల నిధులతో చేపట్టిన మల్లారం నుంచి మిట్ట గూడెం వరకు బిటి రోడ్డు నిర్మాణ పనులకు, అదేవిధంగా మధిర పట్టణంలో విద్యుత్ శాఖకు సంబంధించి నూతన ఇ.ఆర్.ఓ. కార్యాలయ భవన నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. మధిర అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ నూతన కార్యాలయ భవన నిర్మాణానికి డిప్యూటీ సీఎం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గ్రామ, పట్టణాల అభివృద్ధి ప్రభుత్వానికి ప్రాధాన్యమని, ప్రతి గ్రామానికి మెరుగైన రహదారులు, మౌళిక సదుపాయాలు అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలను మెరుగుపరచడం ద్వారా ప్రజలకు సులభ రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు.



నేడు చేపట్టిన గ్రామీణ రహదారి పనులకు సుమారు రూ. 18 కోట్ల 30 లక్షలు పైగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయిన తర్వాత రైతులు, విద్యార్థులు, సాధారణ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు మధిర పట్టణంలో నూతన ఇ.ఆర్.ఓ. (ఈఆర్ఓ) కార్యాలయం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసాచారి, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కె ఎం డి సి లో మెడికల్ కోడింగ్ పై అవగాహన సదస్సు







ఖమ్మం, ఏప్రిల్10(జర్నలిస్ట్ ఫైల్): కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల కాళోజీ నారాయణ రావు సెమినార్ హాల్ నందు ప్లేస్ మెంట్ సెల్ మరియు టాస్క్ వారి ఆధ్వర్యంలో తృతీయ సంవత్సర లైఫ్ సైన్స్ విద్యార్థులకు మెడికల్ కోడింగ్ అనే అంశంపై సెమినార్ నిర్వహించడం జరిగింది. ఈ మెడికల్ కోడింగ్ నేర్చుకోవడం వలన విద్యార్థులు త్వరగా ఉద్యోగాలను సాధించుకోవచ్చునని ఈ కార్యక్రమానికి ట్రైనర్లుగా విచ్చేసిన జి.లోకేష్, ఎన్. నవీన్ తెలియజేశారు. విద్యార్థులకు మెడికల్ కోడింగ్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణారావు మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని మెడికల్ కోడింగ్ పై పట్టు సాధించి తద్వారా ఉపాధి అవకాశాలను



పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. ఇంకా ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కోట అప్పిరెడ్డి, ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్ ఆఫీసర్ ఆర్.పాపారావు, మైక్రో బయాలజీ విభాగాధిపతి ఇ. గురవయ్య ఐ క్యూ ఏ సి కోఆర్డినేటర్ అజయ్ కుమార్ చైతన్య విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నాగపూర్ గ్రామంలో
## సర్పంచ్ అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో జల మహోత్సవ ర్యాలీ




సంగారెడ్డి, ఏప్రిల్ 10 (జర్నలిస్ట్ ఫైల్) : ఎండాకాలంలో నీటిని ఎంత పొదుపుగా వాడుకొని ఇతరులకు నీటి ఎద్దడిని కలగకుండా చూసుకోవడం మన అందరిపై ఉందని నాగాపూర్ సర్పంచ్ అశోక్ గౌడ్ తెలిపారు.గురువారం సంగారెడ్డి మండలం నాగాపూర్ గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటింటికి మంచినీరు నినాదంతో తెలంగాణ రైజింగ్ పేరుతొ పంచాయతీ కార్యదర్శి జగన్ నిర్వహణలో మిషన్ భగీరథ అధికారుల ఆధ్వర్యంలో జల మహోత్సవ వేడుకను గ్రామంలో తిరుగుతూ ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సర్పంచ్ మాట్లాడుతూ..ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన త్రాగునిరు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు.అందరికి ఆరోగ్యానిచ్చే మంచి నీటిని ఏ విధంగా అందించాలి అనే విషయాన్నీ వివరించారు.మంచినీటికి సంబందించిన అన్ని విషయాలను ఎప్పటికపుడు అన్ని రాసుకోవాలని అన్నారు,ఈ సందర్భంగా సర్పంచ్ అశోక్ గౌడ్,ఉప సర్పంచ్ ప్రకాష్ రావ్ వార్డు సభ్యులతో మిషన్ భగీరథ అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముకురాల అశోక్ గౌడ్,ఉప సర్పంచ్ ప్రకాష్ రావ్ పంచాయతీ కార్యదర్శి జగన్ మిషన్ భగీరథ డి.ఈ.హరీష్,ఎఈ.వెంకటేష్ వార్డు సభ్యులు చింతల కీర్తన,కట్కం భాగ్యమ్మ,కాశీపూరం విజయలక్ష్మి,శ్యామల,కట్కం మధు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## పోలవరం జిల్లా ద్వామా పీడీగా
## తూతిక శ్రీనివాస విశ్వనాధ్ నియామకం



రంపచోడవరం, ఏప్రిల్ 10 (జర్నలిస్ట్ ఫైల్) : నూతనంగా ఏర్పడిన పోలవరం జిల్లాకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ గా ఏపీడీ తూతిక శ్రీనివాస విశ్వనాధ్ ను అల్లూరి సీతారామరాజు జిల్లా, జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ నియమించారు. శ్రీనివాస విశ్వనాధ్ ఇప్పటికే జిల్లాలో కీలక విభాగమైన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నోడల్ అధికారిగా, జిల్లా స్వర్ణ పంచాయతీ అధికారిగా పోలవరం జిల్లాకు సేవలు అందిస్తున్నారు. విధి నిర్వహణలో నిబద్ధత, ప్రభుత్వ సేవలు, అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాల పట్ల సమగ్ర అవగాహన కలిగి ఉండడం, వివిధ శాఖలను సమన్వయం చేయడంలో ఉన్న నేర్పరి తనం, సమస్యలు పరిష్కారంలో చురుకైనా పాత్ర పోషించడం వెరసి శ్రీనివాస విశ్వనాధ్ పేరును ద్వామా పీడీగా నియామకానికి కారణమని తెలిసింది.



# రైతుల అభివృద్ధి లక్ష్యంగా సాగునీటి వనరుల విస్తరణకు కట్టుబడి ఉన్నాం

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

- చివరి ఆయకట్టు వరకు సాగునీరు సరఫరా లక్ష్యం
- కట్టలేరు ఆనకట్ట, కాలువల ఆధునీకరణకు రూ. 36.50 కోట్లు
- నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు
- ఎర్రుపాలెంను మోడల్ మండలంగా అభివృద్ధి
- జూన్ 2 నుంచి 1.15 కోట్ల కుటుంబాలకు ఇందిరమ్మ భీమా అమలు
- కట్టలేరు ఆనకట్ట, కాలువల ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం





ఖమ్మం, ఎర్రుపాలెం, ఏప్రిల్10(జర్నలిస్ట్ ఫైల్): రైతుల అభివృద్ధి లక్ష్యంగా సాగునీటి వనరుల విస్తరణకు కట్టుబడి ఉన్నామని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్క అన్నారు.డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క గురువారం ఎర్రుపాలెం మండలం భీమవరం గ్రామంలో రూ. 36 కోట్ల 50 లక్షల వ్యయంతో 4200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే కట్టలేరు ఆనకట్ట, కాలువల ఆధునీకరణ పనులకు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఈ ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకొని, కట్టలేరు ప్రాజెక్టు కాల క్రమేణా కాలువలు దెబ్బతినడం వల్ల రైతులకు నీరు సక్రమంగా చేరడం లేదని, చివరి రైతు వరకు నీరు అందించేందుకు ఆధునీకరణ పనులు చేపట్టినట్లు చెప్పారు.కట్టలేరు, వైరా నది, మున్నేరు మూడు నదుల నీటి ప్రవాహాలు ఉన్నప్పటికీ వాటిని సక్రమంగా వినియోగించలేక పోయామని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు పైనే దృష్టి పెట్టి ఈ ప్రాంత సమస్యలను పట్టించు కోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కట్టలేరు కాలువల లైనింగ్ పనులకు 36.50 కోట్లు మంజూరు చేసి చివరి రైతు వరకు నీరు చేరేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎర్రుపాలెం ప్రాంతంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు (ఎన్ ఎస్పీ) క్రింద కూడా సాగు ఉన్నప్పటికీ జోన్-3లో నీరు సరిగ్గా అందడం లేదని, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రతిపాదించినా గత ప్రభుత్వం దానిని నిర్లక్ష్యం చేసిందన్నారు. సీతారామ ప్రాజెక్టుకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం వల్ల ప్రాంతం నష్టపోయిందని తెలిపారు. జవహార్ లింక్ కాలువతో గోదావరి నీటిని ఎన్ఎస్పీతో అనుసంధానం చేసామని చెప్పారు. నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం కాలువల ఆధునీకరణను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందన్నారు. వ్యవసాయ అభివృద్ధితో పాటు పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయడంతో పాటు డైట్ ఛార్జీలు పెంచినట్లు తెలిపారు. ఎర్రుపాలెంను మోడల్ మండలంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. రాబోయే జూన్ 2 నుంచి రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు ఇందిరమ్మ భీమా అమలు చేస్తామని ఫైన్ రైస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. టెక్నికల్ విద్యను అభివృద్ధి చేయడంతో పాటు ఏటిసి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రూ. 500 గ్యాస్ సిలిండర్ పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్, పాలు, జావ అందించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళాల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, ఇరిగేషన్ ఎస్ఇ వాసంతి, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## పారిశుద్ధ్య కార్మికురాలు పై దాడి

కార్మికులపై దాడి చేస్తే సహించేది లేదు మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్



రాజేంద్రనగర్, ఏప్రిల్10(జర్నలిస్ట్ ఫైల్): అకారణంగా హోటల్ వద్ద చాయ్ తాగుతున్న పారిశుద్ధ కార్మికులను బండ బూతులు దూషించిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐటియుసి) రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి,రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని హసన్ నగర్ చౌరస్తా గ్రాండ్ హోటల్ దగ్గర పారిశుధ్య కార్మికులపై దాడి జరిగిన విషయం తెలుసుకున్న తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టర్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి,రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి దాడికి గురైన పారిశుధ్య కార్మికురాలు ఎన్.సత్యమ్మ వయసు 55 సంవత్సరాలు దాడి జరిగిన విషయాన్ని అడిగి అన్ని విషయాలు తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఈనెల02 ఏదైనా (గురువారం) రోజు ఉదయం ఐదున్నర గంటలకు హాజరు వేసుకొని విధులు నిర్వహిస్తున్న సమయంలో గ్రాండ్ హోటల్ దగ్గరకనే పారిశుధ్య పనులు చేసే సమయంలో కార్మికురాలు చాయ్ ఇవ్వాలని హోటల్ లో పనిచేసే వ్యక్తిని అడగడం జరిగింది.హోటల్ దగ్గర అక్కడనే ఉన్న గుర్తుతెలియని వ్యక్తి పారిశుధ్య కార్మికురాలని ఎవరికి చెప్పలేని విధంగా ఎవరు కూడా వినని బూతు మాటలు మాట్లాడడంతో కార్మికురాలు ఎందుకు మాట్లాడుతున్నావు మీ ఇంట్లో కూడా ఆడవాళ్లను వేరే వాళ్ళు మాట్లాడితే ఊరుకుంటావా అని మాట్లాడడం జరిగిందన్నారు.వెంటనే గుర్తుతెలియని వ్యక్తి పారిశుధ్య కార్మికురాలు పై దాడి చేయడం జరిగింది.దాడి చేసి పారిపోతున్న సమయంలో అక్కడనే ఉన్న శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ (ఎస్ఎఫ్ఏ) ఎందుకు మా కార్మికురాలి పై దాడి చేశావని అడుగుతే పొంతనలేని సమాధానం చెప్పుకుంటూ వెళ్లిపోతున్న సమయంలో కార్మికురాలు నన్ను ఎందుకు కొట్టావు పోలీసులు వచ్చేవరకు ఇక్కడే ఉండాలని అడ్డు తగలడం జరిగిందన్నారు.పోలీసులు వచ్చేవరకు అతను పారిపోవడం జరిగింది. బహదూర్ పుర పోలీస్ స్టేషన్ లో కార్మికురాలు ఫిర్యాదు చేయడం జరిగింది.కార్మికురాలు ఉస్మానియా హాస్పిటల్ కి వెళ్లి ట్రీట్మెంట్ చేయించుకోవడం జరిగింది.ఉస్మానియా హాస్పిటల్లో ఎమ్మెల్సీ నెంబర్:10809 పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.పోలీసులు అతన్ని వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వనంపల్లి జైపాల్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాని డిమాండ్ చేయడం జరిగింది.లేనియెడల అత్తాపూర్ సర్కిల్ పరిధిలో పనిచేసే కార్మికులందరూ పోరాటానికి సిద్ధమవుతామని తెలిపారు.

## ఖమ్మం జిల్లా అటవీ శాఖ" వనజీవి రామయ్య"
## చిత్ర బృందానికి ఘనంగా సన్మానం



ఖమ్మం, ఏప్రిల్10 (జర్నలిస్ట్ ఫైల్) : జిల్లా అటవీ శాఖాధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ నేతృత్వంలో, వాసవిక్ సేవా ఫౌండేషన్ సహకారంతో "వనజీవి రామయ్య" చిత్ర బృందాన్ని గౌరవిస్తూ ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భద్రాద్రి సర్కిల్ అటవీ సంరక్షణ ప్రధాన అధికారి డాక్టర్ డి. భీమా నాయక్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య తన జీవితాన్ని నిస్వార్థంగా ప్రకృతి రక్షణకు అంకితం చేశారని, ఇది ఖమ్మం జిల్లాకే కాక తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని కొనియాడారు. ఆయన పర్యావరణ ప్రస్థానంలో కుటుంబ సభ్యుల సహకారం అభినందనీయమన్నారు. ముఖ్యంగా తాను పెంచిన విలువైన ఎర్రచందనం చెట్లను ప్రభుత్వానికి అప్పగించడం ద్వారా రామయ్య తన ప్రజా శ్రేయస్సు పట్ల ఉన్న నిబద్ధతను చాటుకున్నారని గుర్తుచేశారు.గౌరవ అతిథిగా విచ్చేసిన మున్సిపల్ మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ రామయ్య విజయంలో ఆయన భార్య జానకమ్మ కృషి మరువలేనిదని అన్నారు. జానకమ్మ కి పెన్షన్ సౌకర్యం కల్పించే విషయంపై జిల్లా కలెక్టర్‌తో చర్చిస్తానని ఆమె హామీ ఇచ్చారు. మరో అతిథి అదనపు కలెక్టర్ పిన్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రామయ్య జీవిత కథను స్ఫూర్తిదాయకమైన సందేశాత్మక చిత్రంగా మలుస్తున్న చిత్ర బృందాన్ని అభినందించారు.ఖమ్మం జిల్లా అటవీ శాఖాధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ గత ఆరు నెలలుగా ఖమ్మంలోని వెలుగుమట్ల అర్బన్ పార్క్, వికారాబాద్ అటవీ ప్రాంతాల్లో షూటింగ్ కోసం అటవీ శాఖ తరపున పూర్తి సహకారం అందించామని తెలిపారు. ప్రస్తుత, భవిష్యత్ తరాలు రామయ్య జీవితం నుండి స్ఫూర్తి పొంది మొక్కలు నాటడం, వన్యప్రాణులను రక్షించడాన్ని బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సినిమా ముహూర్తపు షాట్ ఫోటోను డీఎఫ్ఓ కి జ్ఞాపికగా అందజేశారు.గద్దర్ అవార్డు - 2025: ఉత్తమ షార్ట్ ఫిలిం విభాగంలో తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక గద్దర్ అవార్డు - 2025 గెలుచుకున్న సందర్భంగా చిత్ర బృందాన్ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు, నంది అవార్డు గ్రహీత వేముగంటి, నిర్మాతలు నిడిగొండ నరేష్ కుమార్, లింగంపల్లి చంద్రశేఖర్, ప్రముఖ నటుడు బ్రహ్మాజీ (వనజీవి రామయ్య పాత్రధారి), నటి నాగరాణి (జనకమ్మ పాత్రధారి), సంగీత దర్శకుడు బల్లేపల్లి మోహన్, ఛాయాగ్రాహకుడు తోట వి. రమణ పాల్గొని, వారికి శాలువాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. టి దయాకర్ రెడ్డి మాట్లాడుతూ రామయ్య తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ జానకమ్మ కి పెన్షన్ అందేలా చూడాలని అధికారులను కోరారు. దర్శకుడు వేముగంటి చిత్ర బృందం తమకు అడుగడుగునా సహకరించిన డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## ఉమ్మడి ఖమ్మం జిల్లా రైల్వే సమస్యలపై
## ఎంపీ రఘురాం రెడ్డి ప్రత్యేక చొరవ

- ఢిల్లీలో కీలక భేటీ
- డోర్నకల్- మిర్యాలగూడ, డోర్నకల్ - గద్వాల రైల్వే లైన్ల అలైన్మెంట్ మార్చాలి
- ప్రత్యామ్నాయంగా వెన్నారం, కురవి, అబ్బాయి పాలెం, మరిపెడ, మోతె మీదుగా ఏర్పాటు చేయండి
- కొత్తగూడెం రైల్వే స్టేషన్ ఎదుట రహదారి విస్తరణకు భూ మార్పిడి చేపట్టండి
- ఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ఈడీని కోరిన రామసహాయం
- రైల్వే నుంచి సానుకూల స్పందనతో త్వరలోనే పెండింగ్ పనులకు మోక్షం



న్యూఢిల్లీ, ఏప్రిల్10 (జర్నలిస్ట్ ఫైల్): ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న రైల్వే సమస్యలపై ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో కేంద్ర రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్, రైల్వే బోర్డ్ చైర్మన్, సికింద్రాబాద్ రైల్వే జీఎంలను కలిసిన విషయం విదితమే. ఈ క్రమంలో తాజాగా గురువారం ఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) వికాస్ కుమార్ జైన్ ను కలిసి కీలక సమస్యలను వివరించారు. కొత్త రైల్వే లైన్లు, స్టేషన్ల అభివృద్ధి, ప్రయాణికుల సౌకర్యాల పెంపుపై త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారానికి సానుకూల స్పందన లభించిందని ఎంపీ తెలిపారు.

ప్రత్యామ్నాయ రైల్వే లైన్లు చేపట్టాల్సిందే

పాలేరు నియోజక వర్గంలోని అన్ని మండలాల మీదుగా వెళ్ళనున్న డోర్నకల్ - మిర్యాలగూడ, డోర్నకల్ - గద్వాల రీ అలైన్మెంట్ల కోసం గతంలో పలు విజ్ఞాపనలు చేశామని, రైల్వే అధికారులు సర్వే కూడా పూర్తి చేశారని గుర్తు చేశారు. సానుకూల స్పందన నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా వెన్నారం, కురవి, అబ్బాయిపాలెం, మరిపెడ, మోతె మీదుగా రైల్వే లైన్ ఏర్పాటు చేయాల్సిందిగా విన్నవించారు. ఇందుకోసం వేగవంతంగా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.

- భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) రైల్వే స్టేషన్ నుంచి న్యూ గొల్లగూడెం మీదుగా జాతీయ రహదారి అంశం ప్రస్తావన, భూ మార్పిడి పై విన్నపం

రోడ్డు విస్తరణకు కొత్తగూడెం (బీడీసీఆర్) స్టేషన్ వద్ద 4,556 చ.మీ. (5,449 చదరపు గజాలు) రైల్వే భూమి అవసరమని, ఈ భూమికి బదులుగా ఖమ్మం రైల్వే స్టేషన్ వద్ద 9,969.5 చ.మీ. రాష్ట్ర ప్రభుత్వ భూమిని రైల్వేకు ఇచ్చేందుకు సిద్ధమని వివరించారు. ఈ మేరకు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టర్ల నుంచి దక్షిణ మధ్య రైల్వేకు 2025, నవం బర్ 14న ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు

## మై నే రాజస్థాన్ కా షేర్

- లీడర్లందరూ నా వాళ్లే - పర్మిషన్లు, పర్యవేక్షణలు జాంతా నై - మార్కెట్ కమిటీ తో మాకేంటి - జీఎస్టీ తో పని ఏంటి
- పండ్లతో,పైసలతో ఫిదా చేస్తాం - మామిడి మార్కెటా మజాకా - టేస్ట్ చేస్తే టెస్ట్ కెనా - ప్రాణాలే కాదు పైసలతోనూ చెలగాటం

తల్లాడ, ఏప్రిల్ 10 (జర్నలిస్ట్ ఫైల్) : మామిడి సాగులో భారతదేశం ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్నది.మామిడి పండ్లలో రారాజుగా పిలుస్తారు.

ఇది మన జాతీయ ఫలం. తెలంగాణలో ముఖ్యంగా కరీంనగర్,ఖమ్మం,అదిలాబాద్, మహబూబ్ నగర్ లలో ఎక్కువగా సాగు చేస్తున్నారు. మన మామిడి మార్కెట్లో దొరికే మామిడికి పక్క రాష్ట్రాలతో పాటు దేశ విదేశాల్లో మంచి పేరుంది. ప్రస్తుత పరిస్థితుల్లో మామిడి మార్కెట్ స్థానికుల చేతుల్లో నుంచి ఏకంగా ఇతర రాష్ట్రాల వారి చేతుల్లోకి వెళ్లిపోయింది.రాజస్థాన్ నుంచి వచ్చిన కొంతమంది వ్యాపారులు జాతీయ రహదారి వెంట ఉన్న షెడ్లను లీజుకు తీసుకొని,స్థానికంగా కొంతమంది దళారులను ఏర్పాటు చేసుకొని ఉత్తరాదికి ముఖ్యంగా ఢిల్లీ,హిమాచల్ ప్రదేశ్, హర్యానా, పంజాబ్, మహారాష్ట్ర వంటి పలు రాష్ట్రాలకు మామిడిని ఎగుమతి చేస్తున్నారు.మాయా లేదు మర్మం లేదు జస్ట్ కాల్షియం కార్బైడ్ ఉంటే చాలు అన్నట్టు ఉదయం ఆకుపచ్చ రంగులో ఉన్న మామిడికాయ వినటానికి కాదు చూడటానికి కూడా రంగు కూడా వావ్ అనిపించేలా సాయంత్రానికి పసుపు పచ్చ కలర్లోకి మారిపోయి పండుగా మార్చు తున్నారు.ప్రస్తుత మన మార్కెట్లలో అక్కడక్కడ ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా అప్రూవల్ అయిన ఇథలీన్ రిపేనర్ కవర్స్ దర్శనమిస్తున్నాయి.

వాస్తవానికి ఈ ప్యాకెట్లు పౌడర్ ద్వారానో, గ్యాస్ ద్వారానో మాగ పెట్టడం వల్ల పెద్దగా సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు అని శాస్త్రీయ చెప్పుకొస్తుంటారు.

కానీ ఈ ప్యాకెట్లలో వాడేది మాత్రం కాల్షియం కార్బైడే అని, అందువల్ల ఈ ప్యాకెట్లను నీళ్లలో ముంచి పండ్లను మాగబెడు తున్నారని మామిడి ప్రియులు వాపోతున్నారు.

తల్లాడ మండలం నుంచి పక్క రాష్ట్రాలకి కాకుండా దేశ విదేశాలకు మామిడి పండ్ల వ్యాపారం యదేచ్ఛగా నడుస్తున్న రాజస్థాన్ నుంచి వచ్చిన వ్యాపారులు మాత్రం మార్కెట్ కమిటీ అనుమతులతో మాకేంటి జిఎస్టి మాకెందుకు నాయకులందరూ మా వాళ్లే, పర్మిషన్లు, పర్యవేక్షణలు అంటూ ఎవరు వచ్చినా పండ్లలో పెట్టి పైసలు ఇస్తే పని అయిపోతుంది అంటూ బహిరంగ ప్రగల్బాలు పలుకుతున్న పట్టించుకోవలసిన అధికారులు మాత్రం తమ వాటా పండ్లు తమకు వస్తే చాలు అన్నట్లు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు వాపోతున్నారు.

కనీసం జిల్లా కలెక్టర్ స్పందించి టెస్ట్ చేస్తే టెస్ట్ కి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్న మామిడి పండ్ల వ్యాపారాలపై నిఘా పెట్టించి మార్కెట్ కమిటీ ఆదాయాన్ని పెంచడమే కాకుండా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

## బ్రహ్మరథోత్సవంను పరిశీలించిన మఠాధిపతి శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వామి



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ): జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠంలో వైశాఖ మాసం శుద్ధ నవమి నాడు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా ఈనెల 27న బ్రహ్మ రథోత్సవం రోజు సందర్భంగా శుక్రవారం శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం మఠాధిపతి వీరధర్మజ వెంకటాద్రి స్వాములు వారు రథమును పరిశీలించారు. రథముకు సంబంధించిన మరమ్మత్తులను పూర్తిచేయాలని రథశిల్పుల కు ఆదేశాలు జారీ చేశారు. అలాగే షట్టర్ మరమ్మత్తులు పూర్తిగా తయారు చేసేలా మేనేజర్ ఈశ్వరాచారి కి తాగు ఆదేశాలు జారీ చేసారు.. ఈ కార్యక్రమం లో మఠం సిబ్బంది పాల్గొన్నారు.

## నిడమర్రు టిడ్కోలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



○ **ప్రజలకు శుద్ధ తాగునీరు**

మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) : మంగళగిరి నియోజకవర్గంలో ప్రజలకు శుద్ధ తాగునీరు అందించే లక్ష్యంతో మంత్రి నారా లోకేష్ చొరవతో, దివిస్ లేబరేటరీస్ సహకారంతో నిడమర్రు టిడ్కో గృహ సముదాయంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య మాట్లాడుతూ, ప్రజలకు శుద్ధ తాగునీరు అందించడంలో మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. నియోజకవర్గంలో ఇది 28వ మినరల్ వాటర్ ప్లాంట్ కావడం విశేషమని పేర్కొన్నారు. ఈ ప్లాంట్ ద్వారా టిడ్కో గృహ సముదాయ నివాసితులకు పరిశుభ్రమైన తాగునీరు అందుబాటులోకి రానుంది. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి నారా లోకేష్ మరియు దివీస్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి, ఏపీ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల హరిదాసు, గ్రామ పార్టీ అధ్యక్షులు కుర్ర బ్రహ్మం, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్, భీమవరపు శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోషణ పక్వాడ అంశాలపై అవగాహన పెంచుకోండి



○ **మున్సిపల్ కమీషనర్ జె. రామ అప్పలనాయుడు**

తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం తీసుకుంటూ శిశువుకు జన్మనిచ్చిన తరువాత, ఆశిశువుకు ఆరు నెలల వరకు తల్లిపాలు పడుతూ, అనంతరం అనుబంధ ఆహారంతో పాటు, రెండు సంవత్సరాల వరకు తల్లిపాలు బిడ్డకు ఇవ్వడం వల్ల మెరుగైన ఆరోగ్య ప్రయోజనాలు, బిడ్డకు చేకూరుతాయని మున్సిపల్ కమిషనర్ జె. రామ అప్పలనాయుడు పేర్కొన్నారు. ఐసిడిఎస్ పరిధిలో, 13వ వార్డులోని అంగన్ వాడీ కేంద్రంలో శుక్రవారం, 8వ, విడత పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. సిడిపిఓ పి విజయ గౌరీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె రామ అప్పలనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం, అందిచడంతో పాటు, బాలింతలకు,తల్లి, బిడ్డకు ఆరోగ్యకరమైన ఆహారం అందించడం జరుగుతుందని అన్నారు. పోషణ పక్వాడ, ఐదు అంశాలపై ప్రతి తల్లి అవగాహన పెంచుకుని,బిడ్డ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. క్రీడలపట్ల పిల్లలకు ఆసక్తిని పెంచేలా చూడాలన్నారు. శరీర వ్యాయామం ద్వారా, మానశిక, శారీరక ఉల్లాసం పెరుగుతుందన్నారు. సిడిపిఒ విజయగౌరి మాట్లాడుతు పిల్లల పోషణలోతల్లులకు మెళుకువలు వివరించారు. చిరు ప్రాయంలో సెల్ ఫోన్ కు దగ్గర చేయ వద్దని,ఆట పాటలు నేర్పించాలని చెప్పారు. ఈకార్యక్రమంలో సూపర్ వైజర్ సౌజన్య, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలకు వేగవంతమైన పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సందర్భంగా టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి కి వివరించగా, వాటిని సంబంధిత శాఖలకు వెంటనే పంపించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఈ గ్రీవెన్స్ డే కార్యక్రమం ప్రజలకు ఉపయోగకరంగా మారిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ప్రజల అర్జీలపై నిరంతరం పర్యవేక్షణ చేస్తూ, సమస్యలు పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు ఫాలోఅప్ చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండటం, వారి సమస్యలకు వెంటనే స్పందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## గుంటూరు నగరం స్వచ్ఛ లీగ్ సిటీలో చేరేలా కృషి చేద్దాం




ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్): స్వచ్ఛ సర్వేక్షణ్ లో ఈ సంవత్సరం కూడా గుంటూరు నగరం స్వచ్ఛ లీగ్ సిటీలలో స్థానం పొందేలా ప్రజారొగ్యాధికారులు కృషి చేయాలని నగర కమిషనర్ కె.మయూర్ ప్రజారోగ్య అధికారులకు తెలిపారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజారోగ్య విభాగం సమీక్షా సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, స్వచ్ఛ సర్వేక్షణ్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని, కావున అందరు శానిటరీ ఇన్స్పెక్టర్లు వారి వారి డివిజన్లలో పరిశరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. నగరంలో నూరు శాతం డోర్ టు డోర్ చెత్త సేకరణ జరగాలని, సి అండ్ వేస్ట్ తొలగింపు సమయంలో పట్టణ ప్రణాళిక అధికారుల సహకారం తీసుకోవాలన్నారు. నగరంలో ఉన్న ఆర్ ఆర్ ఆర్ సెంటర్లు, క్లస్టర్ కంపోస్ట్ సెంటర్లు అన్నింటిని తనిఖీ చేసుకోవాలని ముఖ్యంగా ప్రజలు తమ గృహాలలో హోమ్ కంపోస్ట్ చేసేలా వారికి అవగాహన కలిగించాలన్నారు. ప్రధాన డ్రైన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు వేసే ప్రాంతాలను గుర్తించి, సదరు ప్రాంతాలలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మధ్యాన్నం సమయాల్లో వార్డులలో జరుగుతున్న పారిశుధ్య పనులను డిప్యుటీ కమిషనర్లు తనిఖీ చేయాలని, మధ్యాన్నం సమయాల్లో వార్డులలోని డ్రైన్లలో సిల్ట్ తొలగింపునకు గ్యాంగ్ వర్క్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నగరంలోని పబ్లిక్ టాయిలెట్స్ మరియు వాటి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాల పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. నగర సునరీకరణలో భాగంగా వాల్ పెయింట్లు వేయించి, వాల్ పోస్టర్లను తొలగించాలని ప్రజారోగ్యాదికారులను ఆదేశించారు. నగరంలో యాంటి మలేరియా పనులు విరివిగా నిర్వహించాలని, సైడు కాలువలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాలలో మరియు పాండ్లలో గంబోషియా చేపలను వేసి, స్ప్రే మరియు ఫాగింగ్ చేయించాలని, నగరంలో దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని బయాలజిస్ట్‌ను ఆదేశించారు.

సమావేశంలో సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, డిప్యుటీ కమిషనర్లు బి. శ్రీనివాసరావు, జి. సాంబశివరావు, సి. హెచ్ శ్రీనివాస్, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, బయాలజిస్ట్ శేషయ్య, విఎయస్ డాక్టర్ నాగేశ్వరావు, శానిటరీ సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## భూ వివాదరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : చీఫ్ విప్ జీవి



వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ): భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దరమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వం చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. మీ భూమి– మీ హక్కు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చీఫ్ విప్ కార్యాలయంలో వినుకొండ మండలం దొండపాడు గ్రామానికి చెందిన రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను చీఫ్ విప్ జీవి ఆంజనేయులు గారి చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2027 డిసెంబర్ నాటికి రీ సర్వే పూర్తి చేసి రాష్ట్రంలో రైతులు భూ యజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో ఎవరు ట్యాంపరింగ్ చేయకుండా ఒక పైసా అవినీతికి తావు లేకుండా క్యూఆర్ కోడ్ తో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. వారసత్వంగా వచ్చిన ఆస్తిపై గత వైసిపి పాలనలో జగన్ పాస్ పుస్తకాలపై ఫోటోలు వేసుకుంటే బ్యాంకుల్లో రుణాలు కూడా ఇవ్వక రైతులు నష్టపోయారన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలపై, పొలం హద్దురాలపై పేర్లు ఫోటోలు ముద్రించుకున్నారని, వాళ్లు అడిగిన భూములు ఇవ్వకపోతే 22 ఏలో పెట్టి కక్ష సాధింపు చర్యలు చేశారని, రీ సర్వే పేరుతో అనేక తప్పులు కూడా చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రీ సర్వే చేయించి గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలను సరిచేసి రాజముద్రతతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం 22 లక్షల 34 వేల మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వడం జరిగిందని, దానిలో భాగంగా వినుకొండ మండలం దొండపాడు గ్రామంలో రిసర్వే పూర్తి చేసి 1185 మంది రైతులకు పాస్ పుస్తకాలు ఇవ్వడం ఎంత సంతోషంగా ఉందన్నారు. భూ యజమాని పేరు నమోదులో చిన్నపాటి అక్షర దోషాలు ఉన్న రెవెన్యూ అధికారులు వెంటనే సరిచేసి పాస్ పుస్తకాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు,వినుకొండ తాసిల్దార్ సురేష్ నాయక్, ప్రజా ప్రతినిధులు, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్షయవ్యాధి రహిత భారత్ నినాదం విధానంగా పనిచేద్దాం



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):క్షయ వ్యాధిని 2030 నాటికి పూర్తిగా భారతదేశం నుండి నిర్మూలించడమే టిబి ముక్త్ భారత్ అభియాన్ ప్రధాన లక్ష్యమని,ప్రత్యేక పరిపాలన అధికారి, తెనాలి తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మండల పరిదిలోని కఠెవరం పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో శుక్రవారం టిబి ముక్త్ భారత్ అభియాన్ ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

పంచాయితీ ప్రత్యేక అధికారి, తహశీల్దార్ కెవి. గోపాలకృష్ణ మాట్లాడుతు రోగాలు సంక్రమించకుండా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత అవసరమని అలాగే పరిసరాల పరిశుభ్రత ద్వారా వ్యాధి రహిత గ్రామాలుగా తీర్చిదిద్దవచ్చన్నారు.

టిబి యూనిట్ తెనాలి వైద్య అధికారిని దేవరపల్లి సుభాష్ రమాదేవి మాట్లాడుతూ టీబీ ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అన్నారు. క్షయ వ్యాధిని అరికట్టడమే లక్ష్యంగా 100 రోజులపాటు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం ద్వారా హై రిస్క్ ప్రాంతాలుగా ఎంపిక చేసి,రోగులకు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారం రోజులుగా దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, బరువు తగ్గడం లాంటి లక్షణాలు ఉన్నవారు తప్పకుండా వైద్యులను సంప్రదించాలని సూచన చేశారు.

ఈ శిబిరాల్లో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి హ్యాండ్ ఎక్స్రే, కళ్లే, మూత్ర, రక్త పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల అభివృద్ధి అధికారి అత్తోట దీప్తి మాట్లాడుతూ టిబి ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా హైరిస్క్ గ్రామాలలో ప్రత్యేక స్క్రీనింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కఠెవరం గ్రామంలో నాలుగు టీబీ కేసులను గుర్తించి వారికి వైద్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే కొలకలూరు, కోపల్లె గ్రామాల్లో చెరో రెండు టీబీ కేసులు నమోదు అయ్యాయన్నారు.

అనంతరం కొలకలూరు పిహెచ్సి డాక్టర్ సిహెచ్ వి సుబ్బారావు, డిడి యు దిలీప్, టిబి యూనిట్ జిల్లా కోఆర్డినేటర్ వి రాజశేఖర్ లు శిబిరంలో వైద్యపరీక్షలు చేసిన వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టిబి యూనిట్ సూపర్వైజర్ డాక్టర్ రవికుమార్, టిబి హెల్త్ విజిటర్ డాక్టర్ రవి కుమార్, వైద్య సిబ్బంది ఎం రాజయ్య, ఎం వెంకటరెడ్డి, కె ప్రసన్నకుమారి, వి ఝాన్సీ, ఎంఎన్ హెచ్ పి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## అధికారులు జవాబుదారీగా ఉండాలి



○ **వార్డుల్లో సమస్యలను పట్టించుకోవాలి**

○ **ఉన్నతాధికారుల పర్యవేక్షణ అవసరం**

○ **సంగడిగుంటలో పర్యటించిన ఎమ్మెల్యే నసీర్**

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులు జరుగుతున్న తీరును, ప్రజల అవసరాలను తెలుసుకునేందుకు పర్యటనలు చేపట్టామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. అందులో భాగంగా శుక్రవారం ఉదయాన్నే సంగడిగుంట, కబాడీగూడెం ప్రాంతాల్లో ఎమ్మెల్యే నసీర్ స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పర్యటించారు. స్థానిక సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు.. ఇక్కడ శానిటేషన్ అధ్వానంగా ఉండటాన్ని గుర్తించి వెంటనే అధికారులకు సమాచారం అందించారు. శానిటేషన్ పనుల్లో ఎలాంటి అలసత్వం వహించిన సహించేది లేదని హెచ్చరించారు ప్రజలు ఏ సమస్య వచ్చినా వెంటనే తమ కార్యాలయం ఫోన్ నంబర్లకు సంప్రదించవచ్చని సూచించారు.. సచివాలయ సిబ్బంది జవాబుదారీతనం కలిగి ఉండాలన్నారు.. వీరికి విధుల పట్ల అవగాహన లేకపోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం క్షేత్రస్థాయిలో కనిపించిందని పేర్కొన్నారు.. దీనిపై పర్యవేక్షణ ఉండాలని ఉన్నతాధికారులకు సూచించారు.

## చిలువూరులో డ్రైన్ సైడ్ వాల్స్ నిర్మాణానికి శంకుస్థాపన



○ **రూ.1.20 కోట్ల పనులకు శ్రీకారం**

మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) : మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధి దిశగా మంత్రి నారా లోకేష్ చొరవతో మరో కీలక మౌలిక వసతుల పనికి శ్రీకారం చుట్టారు. దుగ్గిరాల మండలం చిలువూరు--తుమ్మపూడి గ్రామాల మధ్య రూ. 1.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న డ్రైన్ రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన నిర్వహించారు.

మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధి నిధులు (జీవో నంబర్: ఆర్టి/450 ద్వారా మంజూరైన ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా మొత్తం 234 మీటర్ల పొడవున డ్రైన్ సైడ్ వాల్స్ నిర్మాణం చేపట్టనున్నారు. పనులు పూర్తయిన తర్వాత వరదల సమస్యలు తగ్గి, పరిసర ప్రాంతాల ప్రజలకు ఉపశమనం కలుగుతుందని అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా దుగ్గిరాల మార్కెట్ యార్డ్ చైర్మన్ ఉన్నం ఝాన్సీ రాణి, ఎంపీపీ జబిన్ మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల కోసం మంత్రి నారా లోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కారం చూపడం ఆయన ప్రత్యేకత అని అన్నారు. ఈ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినందుకు చిలువూరు, తుమ్మపూడి గ్రామాల ప్రజలు మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మరియరోజమ్మ, టీడీపీ నాయకులు ఎండీ నిజాముద్దీన్, మేళం ఆనంద మోహన్, గొర్నెని అనిల్, వాసిరెడ్డి శ్రీనివాసరావు, వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. అధికారులు ఈఈ ప్రేమ్ కుమార్, డీఈఈ అనిల్, ఏఈఈ కిరిటీ కూడా హాజరయ్యారు.

## స్వచ్ఛంద జనగణన సద్వినియోగం చేసుకుందాం




○ **జనగణన జిల్లా డైరెక్టర్ ఎ. ఆదిలక్ష్మి**

తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):ఏప్రిల్ 16 నుండి 31 వరకు జరిగే స్వచ్ఛంద జనగణన ఆన్ లైన్, సేవలను వినియోగించుకోవాలని, జనగణన జిల్లా డైరెక్టర్ ఎ.ఆదిలక్ష్మీ పేర్కొన్నారు.

స్థానిక బుర్రిపాలెం రోడ్ లోని ఎన్ ఆర్ కే, కే ఎస ఆర్ గుప్తాకళాశాలలో, జనగణన ఇన్విజిలే టర్లకు, సూపర్వైజర్లకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజైన శుక్రవారం జనగణన జిల్లా డైరెక్టర్ ఎ.ఆదిలక్ష్మి క్షేత్రస్థాయిలో జనగణన చేసే ఇన్విజిరేటర్లకు పలు సూచనలు చేశారు తెనాలి పురపాలక సంఘ జనగణన చార్జి ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్ జె రామ అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా కార్రక్రమం అనంతరం కమీషనర్ అప్పల నాయుడు మాట్లాడుతూ జనగణ న శిక్షణ తరగతుల కార్యాచరణ వివరించారు 150 మంది సిబ్బందికి తొలి విడత శిక్షణ కార్యక్రమం కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎసిపి వాణి,పురపాలక సంఘ కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జిల్లాను అభివృద్ధి ఫథంలో నడపాలి : జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ




ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి శుక్రవారం జిల్లా కలెక్టర్ సి యం సాయి కాంత్ వర్మ , సంయుక్త కలెక్టర్ అతుతోష్ శ్రీవాత్సవ తో కలసి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలుపై సబ్ కలెక్టర్, జిల్లా అధికారులు , మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, స్పెషల్ ఆఫీసర్స్ తో సమీక్ష సమావేశం నిర్వహించారు

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి యం సాయి కాంత్ వర్మ మాట్లాడుతూ పీజీ ఆర్ ఎస్ దరఖాస్తులను నాణ్యంగా పరిష్కరించాలని , దరఖాస్తు అందిన 12 గంటల్లో పరిశీలించాలన్నారు. ప్రభుత్వం పీ.జీ.ఆర్.ఎస్ ను ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమమని , అందిన ప్రతి దరఖాస్తును అధికారులు నాణ్యతగా, అర్జిదారుని సంతృప్తి మేర పరిష్కరించాలన్నారు. దరఖాస్తు బియాండ్ ఎస్ ఎల్ ఏ కి వెళితే సంబంధిత అధికారికి షోకాజ్ నోటీసు జారీ చేయడం జరుగుతుందన్నారు. జనాభా గణనపై జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల శిక్షణ కార్యక్రమం మండలాల్లో గురువారం నుండి ప్రారంభమైనదని , శిక్షణా కార్యక్రమానికి హాజరు కాని వారిపై చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

**డయేరియా ప్రభలకుండా చర్యలు చేపట్టాలి**

రాబోయే రోజుల్లో డయేరియా ప్రభలకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. కరపత్రాలు , పోస్టర్లు ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని , స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డుల నోటిస్ బోర్డులలో ప్రదర్శించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో గోడలపై అంటించకుండా నోటిస్ బోర్డులలో వుంచాలన్నారు. త్రాగునీరు శుభ్రంగా లేదనే ఫిర్యాదు ఒక్కటి కూడా అందకూడదని , పరీక్షలు జాగ్రత్తగా చేపట్టాలన్నారు. డ్రైన్ల లీకేజ్ లను గుర్తించి మరమ్మత్తులు నిర్వహించాలన్నారు. జలధార , జల హారతి కార్యక్రమంపై మాట్లాడుతూ జిల్లాలో చెరువులు , రిజర్వాయర్లు గుర్తించి యంపీడీఓ లు, ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులు టీమ్ గా ఏర్పడి కార్మికులచే పూడికతీత పనులు చేయించాలన్నారు. పని చేయని బోర్లను గుర్తించి బాగు చేయించాలన్నారు. భూగర్భ జలాలు పెంచే విధంగా చూడాలన్నారు. 15 సంవత్సరాల క్రితం దాక వున్న నీటి వనరుల లభ్యతను గుర్తించి బాగుచేయించాలన్నారు.

**ఎల్ నినో ప్రభావం... ఎండ తీవ్రత.**

ఎల్ నినో ప్రభావం వలన ఎండ తీవ్రత ఎక్కువగా వుండే అవకాశం ఉన్నందున కార్మికులు, వేతనదారుల పని వేళల పట్ల దృష్టి సారించాలని ఆదేశించారు. ఉదయం 10 గంటల నుండే ఎండ తీవ్రత ఉండే అవకాశం ఉంటుందని, సాయంత్రం 4 గంటల వరకు ఎవరు బయటకు రాకుండా చూడాలని అన్నారు. పని ప్రదేశాలల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో వుంచాలన్నారు. స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులతో గ్రామీణ , పట్టణ ప్రాంతాలల్లో చలి వేంద్రాలు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు.

**వడదెబ్బ నివారణ చర్యలపై పోస్టర్ ఆవిష్కరణ**

ఈ సందర్భంగా వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్త చర్యలపై జిల్లా వైద్య శాఖ రూపొందించిన ప్రచార పోస్టర్ ను ఆవిష్కరించారు. 18 సంవత్సరాల మహిళకు సర్వేకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ ను పింక్ ఆర్గనైజేషన్ వారు ఈ నెల 13 నుండి 16 వం-కు నాట్కో సెంటర్ లో నిర్వహిస్తున్నారని డియం అండ్ హెచ్ ఓ జిల్లా కలెక్టర్ కు తెలియజేసారు. మహిళలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా సూచించడం జరిగింది.

జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అధికారులతో మాట్లాడుతూ రెవెన్యు అంశాలైన 22 మాడిఫికేషన్ , రీ సర్వే , పట్టాదారు పాస్ బుక్ , పీజీఆర్ఎస్, రెవెన్యు క్లినిక్స్ , డిజిటలైజేషన్ అఫ్ రికార్డ్స్ , సెన్సస్ పై వివరించారు.

ఈ సమావేశంలో ఇన్చార్జి డీఆర్వో ఏ గంగరాజు, తెనాలి ఇన్చార్జి సబ్ కలెక్టర్, జిల్లా విపత్తుల నిర్వహణ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీ కుమారి, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటరత్నం, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగా రావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి,, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ,, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు. చెన్నయ్య, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి కె.మయూరి, ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేష శ్రీ, , ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజనీర్ శ్రీనివాస మూర్తి, , కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎ. గాయత్రి దేవి, , జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి జి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## సీఎం చంద్రబాబుతో బీసీ సంఘాల భేటీ



- ప్రత్యేక బీసీ కమిషన్, రక్షణ చట్టం ప్రవేశపెట్టాలని వినతి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** బీసీల సంక్షేమానికి తాము ఎప్పుడూ కట్టుబడి ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. బీసీల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని వెల్లడించారు. సచివాలయంలో శుక్రవారం ఏపీ బీసీ సంక్షేమ సంఘం నేతలు ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, జాతీయ అధ్యక్షుడు జే. శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో నేతలు సీఎంకు విజ్ఞాపన పత్రాలను అందించారు. జనాభా దామాషా ప్రాతిపదికన తమకు రిజర్వేషన్లు కల్పించే అంశాన్ని కేంద్రంతో చర్చించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. బీసీలకు రక్షణ చట్టాన్ని కూడా త్వరితగతిన తేవాలని కోరారు. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు, కేంద్రంతో మాట్లాడి ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయించడంతో పాటు, ఓబీసీ సబ్ ప్లాన్ రూపొందించి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ అన్ని శాఖల ఉద్యోగాల నియామకాలలో బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని బీసీ సంఘం నేతలు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఏపీ బీసీ సంఘం నేతల నుంచి విజ్ఞాపన పత్రాలను తీసుకున్న ముఖ్యమంత్రి.... కేంద్రం పరిధిలో ఉన్న అంశాలను వారితో సంప్రదించి నెరవేర్చేందుకు కృషి చేస్తామని అన్నారు. బీసీలకు పూర్తి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. బీసీల అభ్యున్నతి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఈ సందర్భంగా నేతలు ముఖ్యమంత్రితో అన్నారు. బీసీలకు ప్రభుత్వం అందిస్తూన్న ఆదరణ, చేనేతలకు ఉచిత విద్యుత్, మత్స్యకారులకు వేట నిషేధ భృతి, 217 జీవో రద్దు, కల్లు గీత కార్మికులకు 10 శాతం రిజర్వేషన్లు, వడ్డెరలకు మైనింగ్‌లో రిజర్వేషన్లు వంటి వాటిని తెచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని బీసీ నేతలు వ్యాఖ్యానించారు.

## 30% కాలిన గాయాలతో చేరిన చిన్నారికి జీజీహెచ్‌లో ఆధునిక వైద్యం

- ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో చిన్నారికి ప్రత్యేక చికిత్స
- కొల్లాజిన్ ట్రీట్‌మెంట్‌తో కోలుకుంటున్న చిన్నారి
- బబిలైన్ ద్వారా చికిత్స... చిన్నారి పరిస్థితి మెరుగుదల
- గుంటూరు ఆసుపత్రిలో చిన్నారికి సమగ్ర వైద్య సేవలు

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** కాలిన గాయాలతో ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో చికిత్స పొందుతున్న చిన్నారి పరిస్థితి ప్రస్తుతం మెరుగుపడుతోందని ఆసుపత్రి సూపరింటెండెంట్ తెలిపారు. ఈ విషయంపై సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వార్తల నేపథ్యంలో స్పష్టత ఇచ్చారు. ఈ నెల 6వ తేదీ ఉదయం 11 గంటల సమయంలో రెండు సంవత్సరాల చిన్నారి 'చిన్నా' సుమారు 30 శాతం కాలిన గాయాలతో అత్యవసర విభాగానికి తీసుకురాగా, వైద్యులు వెంటనే స్పందించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం చిన్నారిని ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి తరలించినట్లు వెల్లడించారు. రెండు గంటలలోపు ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లి కొల్లాజిన్ ఆధారిత ఆధునిక చికిత్స అందించినట్లు తెలిపారు. గత రెండు రోజులుగా ప్లాస్టిక్ సర్జరీ విభాగ వైద్యుల పర్యవేక్షణలో చిన్నారి చికిత్స పొందుతోందని పేర్కొన్నారు. చిన్నారికి బబిలైన్ ద్వారా యాంటీబయోటిక్స్, సెలైన్ ద్రావణాలు అందిస్తూ నిరంతర వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్య పరిస్థితి క్రమంగా మెరుగుపడుతోందని, కాలిన గాయాలకు తగిన సమయంలో తగిన చికిత్స అందిస్తున్నామని ప్లాస్టిక్ సర్జరీ విభాగం వైద్యులు పేర్కొన్నట్లు సూపరింటెండెంట్ వివరించారు.

## నగదు రహిత వైద్యం అందించాలి ఉద్యోగ సంఘం వినతి

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంతి ఉద్యోగులకు ప్రభుత్వ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యం అందించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ సర్వీసు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్ బాషా విజ్ఞప్తి చేశారు . ఈ మేరకు శుక్రవారం గుంటూరు జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మను కలిసి సంఘం ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన అనంతరం, నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో నగదు రహిత చికిత్స అమలు విషయంలో ఎదురవుతున్న సమస్యలను వివరించారు. పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ ఆసుపత్రి యాజమాన్యాల్లో మార్పు లేకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యంతో పాటు ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యకు పరిష్కారం చూపాలని కలెక్టర్‌ను కోరారు. ఉద్యోగులకు న్యాయమైన వైద్య సౌకర్యాలు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త రెహమాన్, కోటాసాహేబ్, రాజు, గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు భరత్ కుమార్, జిల్లా కార్యదర్శి హిదయతుల్లా, మహిళా విభాగం అధ్యక్షురాలు సుమిత్రా దేవి, మల్లేశ్వరి, సహకార సంఘ నాయకుడు అన్వర్ బాషా, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగ నాయకుడు జ్ఞానదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్ మరో ఏడాది పొడిగింపు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు అమలు చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్ ను మరో ఏడాది అనగా 2026-27 కు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు శుక్రవారం రాష్ట్రవైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్ జిఓఎంస్ సంఖ్య 43 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో జిఓం ఎంస్ సంఖ్య 12 ద్వారా 2015లో అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్టులు ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా అదే విధంగా ఫ్రీలాన్స్,వెటరన్ జర్నలిస్టులు మరియు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకం మాదిరిగా వివిధ ఎంపానల్డ్ ఆసుపత్రుల ద్వారా గుర్తింపు పొందిన అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా ఎటువంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేకుండా క్యాస్ లెస్ వైద్య సేవలు అందించే లక్ష్యంతో వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్‌ను ప్రవేశపెట్టడం జరిగింది. ఈపథకాన్ని ప్రతి ఏటా అనగా 2016-17 నుండి 2025-26 వరకూ పొడిగించడం జరిగింది. మరలా ఈవర్కింగ్ జర్నలిస్టుల కాంప్రెహెన్సివ్ హెల్తు స్కీమ్ ను మరో ఏడాది కాలానికి అనగా 2026-27 కు పొడిగించాలన్న సాధారణ పరిపాలన శాఖ(ఐఅండ్ పిఆర్)విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈనెల 1వ తేదీ నుండి వచ్చే ఏడాది మార్చి 31 వరకూ పొడిగిస్తూ నిర్ణయం తీసుకుని ఆమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్ పొడిగింపు ఉత్తర్వులకు అనుగుణంగా వెంటనే తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి డా.ఎన్టిఆర్ వైద్య సేవ ట్రస్ట్ మరియు సంచాలకులు సమాచార పౌర సంబంధాల శాఖ చర్యలు తీసుకోవాల్సిందిగా వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్ ఆఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# ప్రజలకు పాలకులకు వారధి ప్రజాసమస్యల పరిష్కార వేదిక : ఎమ్మెల్సీ ఆలపాటి

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** ప్రజలకు ప్రజా ప్రతినిధులకు వారధిలా ప్రజాసమస్యల పరిష్కార వేదిక పనిచేయాలన్నదే తెలుగుదేశం అధిష్టానం ఆలోచనని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు.

స్థానికరామలింగేశ్వర పేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి, వివిధ సమస్యలపై అర్జీదారుల నుండి అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలపై స్పందించిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ సంబంధిత శాఖ అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్ళి, వాస్తవ పరిస్థితులు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతు వచ్చిన అర్జీల గురించి వివరించారు. ఇళ్ళు, రేషన్ కార్డులు, పెంక్షన్, అన్నదాత సుఖీభవ ద్వారా లబ్ధి చేకూరలేదని ఇలా పలు సమస్యలు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో, ఏ వ్యక్తి ఎలాంటి సమస్యతొ ఇబ్బంది పడరాదనే సంకల్పంతొ, తెలుగుదేశం అదిష్టానం ఆదేశాల మేరకు, రాష్ట్రవ్యాప్తంగా ప్రజా దర్బారు కార్యక్రమాల ద్వారా



ప్రజల సమస్యలు తెలుసుకుని, తగు పరిష్కార కార్యాచరణకు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రీవెన్స్ కు వచ్చిన అర్జీలను సంబందిత శాఖలకు పంపడంతొపాటు, సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అమరావతికి చట్టబద్ధత లభించడం పట్ల, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి రాజధాని గురించి ఏమీ ఆలోచించవద్దని చెబుతూ, వైద్యం అందక ఆయనేదో మాట్లాడుతుంటే స్థానిక నాయకులు ఏం మాట్లాడాలో తెలియక, ఏమి మాట్లాడకపోతే వెనకబడిపోతామనె ఏదో మాట్లాడుతున్నారని అన్నారు. అదేవిధంగా వైసిపి నాయకుల మైడ్ సెట్, పైనుండి క్రింద వరకు ఒకే తరహాలో, ఉందని,అర్ధంలేని వ్యాఖ్యలతో ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. స్థానిక నాయకుడు, ఏమి మాట్లాడాలో తెలీక, ఏమిచేయడానికి లేక, మాట్లాడక పోతే వెనకబడి పోతామనె విధానంతొ మాట్లాడుతున్నాడని అన్నారు. మతి భ్రమించిన ఆ నాయకుడికి వైద్యం అందించడమేకష్టమని, ఇక్కడా అదేపరిస్థితి ఏర్పడితే ఇబ్బందని అన్నారు. వారికి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా,కూటమి ప్రభుత్వం ప్రజలకు చేరువగా పనిచేస్తుందన్నారు. ఈప్రాంతంలో రాజధాని గురించి వేరేగా మాట్లాడి, ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దని హితవు పలికారు. నిజం దేవుడికి, నీరుపల్లానికి అనే నానుడిని మరవద్దన్నారు. రాజధాని విషయంలో విచక్షణతో మాట్లాడాలన్నారు. గ్రీవెన్స్ కార్యక్రమంలొ పట్టణ టిడిపి అధ్యక్షులు మహమ్మద్ కుద్దూస్, జొన్నాదుల మహేష్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ మంగమూరి హరిప్రసాద్, వైస్ చైర్మన్ అక్కిశెట్టి వెంకట్రావు, తదితర పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# రాజధాని ప్రాంతంలో డీజిల్ దొంగల ముఠా అరెస్ట్

- వివరాలు వెల్లడించిన నార్త్ సబ్ డివిజన్ డిఎస్పి సిహెచ్ మురళీకృష్ణ
- 700 లీటర్ల డీజిల్ ఇన్నోవా కారు స్వాధీనం.
- కీలక నిందితుడు పరారీలో



**మంగళగిరి( జర్నలిస్ట్ ఫైల్):** రాజధాని ప్రాంతంలో డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్న 5 గురు ముఠా సభ్యులను మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుండి సుమారు 700 లీటర్ల డీజిల్, రూ. 25,750 నగదు, ఒక ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం మంగళగిరి రూరల్ సీఐ కార్యాలయంలో మంగళగిరి నార్త్ సబ్ డివిజన్ డిఎస్పి సిహెచ్ మురళీకృష్ణ అరెస్టు వివరాలను వెల్లడించారు.

పల్నాడు జిల్లా అమరావతి మండలం మునుగోడు గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు కలికొండ వెంకట్రావు (A1) నేతృత్వంలో ఈ ముఠా పనిచేస్తుందని. అతనికి గతంలోనే 12 క్రిమినల్ కేసులు ఉండగా, పీడీ యాక్ట్ కేసులో జైలు శిక్ష అనుభవించి వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం కీలక నిందితుడు పరారీలో ఉండగా, అరెస్టయినా ఐదుగురు ముఠా సభ్యులు పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం 75 తాళ్లూరు గ్రామానికి చెందిన నీలంశెట్టి నాగరాజు (A2), బెల్లంకొండ మండలం విన్నాయపాలెం గ్రామానికి చెందిన మేకల సాయి గణేష్ (A3), మేకల వెంకటేష్ (A4), మేకల వెంకటేష్ (A5), అమరావతి మండలం మునుగోడు గ్రామానికి చెందిన ఆరుద్ర వీరబాబు (A6) సభ్యులుగా ఉన్నారు.

వీరు రాత్రి వేళల్లో రోడ్లపై నిలిపి ఉంచిన లారీలు, యంత్రాల నుండి డీజిల్‌ను దొంగతనం చేసి, అమాయక రైతులకు తక్కువ ధరకు అమ్ముతూ వచ్చారు.

ఏప్రిల్ 4న రాత్రి ఇన్నోవా కారులో తిరుగుతూ కురగల్లు, నవులూరు, టోల్ గేట్లు, డాన్ బాస్కో స్కూల్ పరిసర ప్రాంతాల్లో నిలిపిన వాహనాల నుండి డీజిల్ దొంగతనం చేసినట్లు విచారణలో తేలింది. లీటరు రూ. 70 నుంచి రూ. 80 వరకు విక్రయించినట్లు పోలీసులు తెలిపారు.

మార్చి 30 నుండి ఏప్రిల్ 3 మధ్య మేఘా కంపెనీ, బీఎస్‌ఆర్ కంపెనీ, ఎంవీఆర్ మరియు నవులూరు వాటర్ ట్యాంక్ సెంటర్ ప్రాంతాల్లో సుమారు 700 లీటర్ల డీజిల్ దొంగిలించి విక్రయించినట్లు వెల్లడైంది.

ఏప్రిల్ 3 అర్ధరాత్రి కురగల్లు ప్రాంతంలో పోలీసులు వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించగా, నిందితులు కారును వదిలి పారిపోయారు. అనంతరం నీరుకొండ గ్రామ శివారులో ఈూ2 నుండి ఈూ6 వరకు నిందితులను అరెస్ట్ చేసి, 9 డీజిల్ క్యాన్లు, డీజిల్, నగదు మరియు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వారిని రిమాండ్‌కు పంపారు. ఈ ఘటనపై మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో 5 ఐదు కేసులు నమోదైనట్లు తెలిపారు. ప్రజలు, ముఖ్యంగా రైతులు తక్కువ ధరకు డీజిల్ లేదా పెట్రోల్ కొనరాదని, తప్పనిసరిగా అనుమతించిన పెట్రోల్ బంకుల వద్దనే కొనుగోలు చేయాలని పోలీసులు సూచించారు.

ఈ కేసు దర్యాప్తులో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏవి బ్రహ్మం, ఎస్సైలు వెంకటేశ్వర్లు, రవితేజ, నవీన్ నాయక్, హెడ్ కానిస్టేబుళ్లు శ్యామ్, రామలింగేశ్వరరావు, కానిస్టేబుళ్లు సాగర్, చలమారావు, సురేష్, అంకమ్మరావు పాల్గొన్నారు.

## అగ్రహారంలో ప్రేమోన్మాది ఘాతుకం

**ఖాజీపేట, కడప జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ):** కాజీపేట మండలం అగ్రహారంలో కీర్తన అనే విద్యార్థిని గొంతు కోసి కిరాతకంగా చంపిన వెంకటేష్ వివరాల్లోకి వెళ్తే కీర్తన కాజీపేట ఏపీ మోడల్ స్కూల్ లో సెకండ్ ఇయర్ పూర్తి చేసింది. కీర్తన తల్లిదండ్రులు రోజు వారి వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లిన సందర్భంలో ఎవరూ లేని సమయంలో ఇంటిలోకి ప్రవేశించి అమ్మాయిని గొంతు కోసి పరారయ్యారు ఇరువురు ఒకే కులానికి చెందినవారు కావడం గత కొంతకాలంగా కీర్తనను ప్రేమిస్తున్నట్లు సమాచారం. కీర్తన తండ్రి రామకృష్ణ పొలం పనులు ముగించుకొని ఇంటి వద్ద వచ్చి చూడగా తన కూతురు కీర్తన రక్తపు మడుగుల్లో పడి ఉండడంతో హుటాహుటిన ఆసుపత్రికి తీసుకెళ్లారు. కీర్తన మార్గమధ్యంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితున్ని మైదుకూరు పోలీస్ స్టేషన్లో విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షిస్తాం



- కడప జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సవిత

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కడప జిల్లా ఖాజీపేటలో విద్యార్థిని బలిగొన్న ప్రేమోన్మాది ఘాతుకంపై జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఎంతో భవిష్యత్తు కలిగిన యువతి హత్యకు గురికావడం మనస్సును కలిచి వేస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. నిందితుడు ఎంతటివాడైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలు, బాలికలపై పట్ల ఉన్మాదిలా వ్యవహరిస్తే ఉక్కుపాదంతో అణిచివేస్తామన్నారు.

ఈ మేరకు శుక్రవారం ఇన్చార్జి మంత్రి సవిత ఒక ప్రకటన విడుదల చేశారు. పెళ్లి చేసుకోవాలంటూ, యువతి ఇంటికి వెళ్లి గొంతు కోయడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. విచక్షణ మరిచి, ఎంతో భవిష్యత్తు కలిగిన యువతిని బలి కొనడం దారుణమన్నారు. నిందితుడు వెంకటేష్ క్షమించరాని నేరం చేశాడన్నారు. ప్రేమోన్మాదికి చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామన్నారు. యువతి కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేసిన మంత్రి సవిత, అండగా ఉంటామన్నారు. భవిష్యత్తులో మరెవరూ మహిళలు, బాలికల వైపు కన్నెత్తు చూడకుండా ఉండేలా చట్టపరంగా నిందితుడిని శిక్షిస్తామన్నారు.

మహిళల పట్ల సైకోల్లా ప్రవర్తిస్తే వారికి అదే చివరి రోజని హెచ్చరించారు. యువత బాధ్యతతో మెలుగుతూ, డ్రగ్స్ కు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

మగ బిడ్డల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పుడూ వారిపై ఓ కన్నేసి ఉంచాలని అన్నారు. నైతిక విలువలతో కూడిన జీవనం సాగించేలా చూడాలని మంత్రి సవిత సూచించారు.

# ప్రతి గ్రామం, ప్రతి వార్డులో బీజేపీ జెండా ఎగరాలి

- బీజేపీ శిక్షణా కార్యక్రమంలో దిశానిర్దేశం





**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ కార్యక్రమం భాగంగా పశ్చిమ అసెంబ్లీ 4వ మండలం (51, 52 డివిజన్లు) పరిధిలోని అరండల్‌పేట యోగి భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పార్టీ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. మండల అధ్యక్షుడు వక్కలగడ్డ తిరుమలరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ, ప్రతి గ్రామం, ప్రతి వార్డులో బీజేపీ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. జెండా పోల్‌పై క్యూ ఆర్ కోడ్ స్కానర్ ఏర్పాటు చేసి, దాన్ని స్కాన్ చేస్తే ఆ గ్రామానికి, వార్డుకు కేంద్ర ప్రభుత్వం అందించిన నిధుల వివరాలు ప్రజలకు తెలియజేయవచ్చని తెలిపారు.

'జనతా వారధి' కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే విధంగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. 'మన్ కీ బాత్' ద్వారా ప్రధానమంత్రి మోడీ ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తూ, ప్రముఖుల జీవిత గాథలు, సాధారణ ప్రజల ప్రతిభ, పురోగతిని దేశానికి పరిచయం చేస్తున్నారని వివరించారు. కేంద్ర పథకాలను ప్రతి ఇంటికి చేరేలా పోలింగ్ బూత్ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు చురుకుగా పనిచేయాలని సూచించారు.

ఉదయం నుంచి నిర్వహించిన ఐదు శిక్షణా సె-షన్లలో కొత్తూరు వెంకట సుబ్బారావు, భీమినేని చంద్రశేఖర్, పాలపాటి రవికుమార్, వరికూటి సుధాకర్ వివిధ అంశాలపై మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, బజరంగ్ రామకృష్ణ, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, మంత్రి సుగుణ, రమాదేవి, పెమ్మరాజు సుధాకర్, దారా అంబేద్కర్, పెద్దింటి కృష్ణచైతన్య, గోవిందరాజుల రాజ్యలక్ష్మి, శ్రీకళ్యాణి, ధనలక్ష్మి, నాగమణి, చేగు నాగేశ్వరరావు, అవంతిష్‌జైన్, కేశానుపల్లి శ్రీరామ్, మంచేళ్ల అశోక్, నాగసాయి, మనోహర్, వెలగలేటి శ్రీదేవి, పూర్ణచంద్ర, సురేష్, రమేష్, సనత్ కుమార్, సుబ్రహ్మణ్యం, కృష్ణమూర్తి, జితేంద్ర గుప్తా తదితరులు, మండల పదాధికారులు, శక్తి కేంద్ర ప్రముఖులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మోతిలాల్ నగరవాసులను మానవత్వంతో ఆదుకుంటాం

- వెల్ఫేర్ సెంటర్ కేటాయించినందుకు సీఎంకు ధన్యవాదాలు
- గుంటూరు ఈస్ట్ ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ప్రజల కోసం త్వరలో టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు
- గత ఐదేళ్లలో రాష్ట్రం సర్వనాశనం
- 11 సీట్లు ఇచ్చిన జగన్ కు బుద్ధి మారలేదు
- విలేకర్ల సమావేశంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా బడ్జెట్ ప్రణాళిక రూపొందించామని, త్వరలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రజలకు ఏ అవసరం వచ్చినా తమను సంప్రదించేందుకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయబోతున్నామని, మోతిలాల్ నగర్ వాసులను మానవత్వంతో ఆదుకుంటామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ వెల్లడించారు.

అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేపట్టిన అభివృద్ధి పనులు, తీసుకుంటున్న నిర్ణయాలు, గత ప్రభుత్వ వైఫల్యాలు, రాజకీయంగా ఎదురవుతున్న విమర్శలకు సమాధానాలను శుక్రవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడారు. వర్షాకాలంలో గుంటూరు నగరాన్ని వేధిస్తోన్న మురుగునీటి సమస్య పరిష్కారానికి గుంటూరు ఛానల్ నుంచి మొండిగేట్ వరకు మురుగు పారుదలకు ఉన్న అడ్డంకులను అధిగమించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు.. మొండిగేట్ వద్ద వెంట్ తక్కువగా ఉండటంతో గుంటూరు నగరం నుంచి వెళ్లే మురుగు పారుదల సక్రమంగా లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వీటిని అధిగమించేందుకు రైల్వే అధికారులతో మాట్లాడి రూ. 8 కోట్ల నిధులతో వెంట్ నిర్మాణాన్ని చేపట్టామని వెల్లడించారు. దీంతో గుంటూరు నగరంలో మురుగునీటి సమస్యకు పరిష్కారం లభించనుందన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో గడ్డిపాడు, చాకిగుంట, నల్లచెరువు వంటి 8 ప్రాంతాలలో చెరువుల అభివృద్ధికి డీపీఆర్ సిద్ధం చేశామని తెలిపారు. తూర్పు నియోజకవర్గంలో ఐపీడీ కాలనీ నుంచి హైవే వరకు, మణి హోటల్ నుంచి బాలాజీ నగర్ వరకు, బొంగరాల బీడు నుంచి శారదా కాలనీ వరకు రోడ్ల నిర్మాణాన్ని చేపట్టామన్నారు.

**ఆటోనగర్ రూపురేఖలు మారుస్తాం**

ఏపీఐఐసీ పరిధిలో ఉన్న ఆటోనగర్ ను ఎన్నో ఏళ్లుగా పట్టించుకున్న నాథుడు లేడని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆటోనగర్ లో మంచినీటి కనెక్షన్ రూ. 5 వేలకే అందించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. దీంతోపాటు ఆటోనగర్లో అన్నా క్యాంటీన్, పీహెచ్ సీ, మొబైల్ టాయిలెట్స్, గ్రీనరీ, రెండు పార్కుల ఏర్పాటు వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబోతున్నామని చెప్పారు. వేసవిలో తాగునీటి సమస్యను అధిగమించేందుకు ప్రతి చోటా బోర్ వెల్స్, కార్పొరేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**మోతిలాల్ నగర్ వాసుల వెన్నంటే ఉంటాం**

మోతిలాల్ నగర్ రైల్వే డ్రెయిన్ల నిర్మాణం విషయంలో అత్యంత చిత్తశుద్ధితో పని చేస్తున్నామని, దీనిపై కొందరు రాజకీయంగా లబ్ధి పొందేందుకు కుయుక్తులు పన్నుతున్నారని ఎమ్మెల్యే నసీర్ మండిపడ్డారు. అయితే కార్పొరేషన్ సకారంతో ఈ ప్రాంతంలో ఇళ్లు కోల్పోయే వంద కుటుంబాలకు చోడవరంలో పునరావాసం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కుటుంబాలకు తాత్కాలిక అవసరాలు తీర్చేందుకు తాను స్వయంగా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమం అందేలా పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. ఎన్టీఆర్ మానస సరోవరం 53 ఎకరాల్లో విస్తరించి ఉందని. గుంటూరు తూర్పు నియోజకవర్గానికే మణిహారంగా మార్చబోతున్నామని వెల్లడించారు.

**వెల్ఫేర్ స్థలంలో క్రీడా ప్రాంగణం**

గుంటూరు తూర్పు నియోజకవర్గం లో 50 ఎకరాల వెల్ఫేర్ స్థలాన్ని కేటాయించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఓటమి నాయకులకు ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ స్థలంలో అద్భుతమైన క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు

**మావిగన్ మూర్ఖుడు జగన్**

మావిగన్ మూర్ఖుడు జగన్ అని, అలాంటి జగన్ వెంట ఉన్న సైకో సైన్యం గుంటూరు తూర్పు నియోజకవర్గం అభివృద్ధికి ఆటంకం కలిగిస్తే ప్రజలు సహించరని హెచ్చరించారు. గత ఐదేళ్ల కాలంలో అన్ని వ్యవస్థలను జగన్ భ్రష్టు పట్టించాడని,. అమరావతికి తాను మద్దతిస్తున్నారని చెప్పి .. ఎన్నికల అనంతరం మూడుముక్కలాటతో రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశాడని విమర్శించారు. రూ. 700 కోట్లతో రుషికొండ ప్యాలెస్ కట్టిన జగన్ పేద ప్రజలకు మాత్రం కేకులు లాంటి సెంటు ముక్కలు ఇచ్చి కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించకుండా తీవ్ర అన్యాయం చేశాడన్నారు..

తల్లిని, చెల్లిని గెంటేసిన జగన్ రాష్ట్రంలో మహిళల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. అలాంటి జగన్ ను వైసీపీ క్యాడర్ ఎందుకు నమ్ముతున్నారో వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని, జగన్ వైఖరితో 151 సీట్లు నుంచి 11 సీట్లకు దించేసినా మార్పు రాలేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని నంబర్ వన్ గా తీర్చిదిద్దడమే లక్ష్యమని మరోసారి స్పష్టం చేశారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467